తెలుగు దినపత్రిక

సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

15-10-2026

గురువారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 247

PUBLISHED FROM HYDERABAD పేజీలు- 8 వెల:రూ.4 /–



తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగ

బతుకమ్మ

పూలను ఓ ఆకారంగా పేర్చి దేవుడిగా పూజించడం అనేది ప్రపంచంలో ఎక్కడ కనిపించదు. ఒక్క తెలంగాణలో మాత్రం బతుకమ్మ పేరుతో పూలను పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రతీ ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూ పాడుతూ చూపరులను అలరించే అరుదైన వేడుక ఈ బతుకమ్మ పండగ. మహాలయ అమవాస్యతో ప్రారంభమై 9 రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండగ శనివారం ప్రారంభంకానుంది.

నాణ్యతా ప్రమాణాల్లో టీజీఎస్పీడీసీఎల్ గుర్తింపు!


- నాలుగు అంతర్జాతీయ నాణ్యతా పురస్కారాలు కైవసం
- డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్న సీఎండీ
- విద్యుత్ పంపిణీ రంగంలో అంతర్జాతీయ స్థాయి మైలురాయి
- నాణ్యతా నిర్వహణకు అంతర్జాతీయ ఐఎస్ఓ 9001 సర్టిఫికేషన్
- డిజిటల్ సమాచార భద్రతకు పకడ్బందీగా ఐఎస్ఓ 27001
- స్టోర్స్ మెటీరియల్ నిర్వహణలో జపనీస్ 5ఎస్ విధానం
- వినియోగదారుల నాణ్యమైన సేవల గుర్తింపుగా క్వాలిటీ మార్క్
- పారదర్శక పాలన, సాంకేతిక పరిజ్ఞానానికి దక్కిన గౌరవం
- అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన చారిత్రక మైలురాయి

తెలంగాణ బ్యూరో అక్టోబర్ 14,(సిరి న్యూస్):

తెలంగాణ విద్యుత్ పంపిణీ రంగంలో సమగ్ర నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, శాస్త్రీయ మెటీరియల్ నిర్వహణ, వినియోగదారులకు అంతరాయం లేని అత్యుత్తమ సేవలు అందించడంలో టీజీఎస్పీడీసీఎల్ అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నాలుగు నాణ్యతా గుర్తింపులను సొంతం చేసుకుంది. నిర్వహణ సామర్థ్యానికి ఐఎస్ఓ 9001, ఐటీ డేటా భద్రతకు ఐఎస్ఓ 27001, వేర్‌హౌస్ క్రమశిక్షణకు జపనీస్ 5ఎస్ విధానం, నిరంతర నాణ్యమైన సేవలకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు సంస్థ కీర్తికిరీటంలో చేరాయి. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఐఎస్ఓ ఆడిటర్ శివయ్య,

మిగతా 2వ పేజీలో..





వెలుగుల బాటలో తెలంగాణ!

ఎల్‌నినో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

డిమాండ్ పెరిగినా నిరంతర కరెంట్ సరఫరాకు చర్యలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.1,014 కోట్లతో విద్యుత్ వ్యవస్థ బలోపేతం

విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క

అచ్చంపేటలో రూ.70.02 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన

అచ్చంపేట, వంగూరు, బల్మూరుల్లో నాలుగు కొత్త సబ్‌స్టేషన్లు

రూ.1.20 కోట్లతో నూతన డివిజన్ విద్యుత్ కార్యాలయ భవనం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రూ.3,477 కోట్ల భారీ పెట్టుబడులు

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్కరణల కోసం రూ.39,951 కోట్ల ఖర్చు

తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రూ.70.02 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆరు కీలక విద్యుత్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆయన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా రంగంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చి రైతాంగానికి, పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు.

అచ్చంపేట, అక్టోబర్ 14 (సిరి న్యూస్)


రూ.70.02 కోట్లతో ఆరు కీలక విద్యుత్ ప్రాజెక్టులు

అచ్చంపేట నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా ప్రతిపాదించిన ఆరు అభివృద్ధి ప్రాజెక్టులకు ఉప ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా అచ్చంపేట మండల కేంద్రంలో రూ.1.20 కోట్లతో నూతన డివిజన్ కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నారు. వంగూరు మండలం గజారా (తిప్పారెడ్డిపల్లి)లో రూ.3.29 కోట్లతో 5 ఎంవీఏ సబ్‌స్టేషన్, అచ్చంపేట పట్టణంలో ఐపీడీఎస్ కింద రూ.1.28 కోట్లతో 8 ఎంవీఏ సబ్‌స్టేషన్, సిద్ధాపూర్‌లో రూ.2.62 కోట్లతో 5 ఎంవీఏ సబ్‌స్టేషన్, బల్మూరు మండలం రామాజిపల్లిలో రూ.2.63 కోట్లతో 5 ఎంవీఏ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నల్లమల ఏజెన్సీ ప్రాంతమైన అమ్రాబాద్ మండలంలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా రూ.59 కోట్ల భారీ వ్యయంతో 220/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భారీ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే అచ్చంపేట, అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని ఏడు సబ్‌స్టేషన్లపై విద్యుత్ భారం తగ్గి, లోవోల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని తెలిపారు.

మిగతా 2వ పేజీలో..



రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్..



- ఒక్కొక్కరికి రూ.17,951
- 11.40 లక్షల మందికి పైగా నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి
- బోనస్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం.. రూ.2,009 కోట్ల వ్యయం

పాలమూరు జిల్లాలో మళ్లీ వలసల దుస్థితి

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించాలి
- నీళ్లుంటే ఈ వలసలు జరిగేవా?
- శ్రీశైలంలో నీళ్లున్నా మోటార్లు నడపలేదు
- విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయి
- ఉచిత కరెంటుకు ఉరితాడు జీవోనెం.17
- పాలమూరు వలసలకు రేవంత్ అసమర్థతే కారణం
- కొడంగల్లో రైతులకు బేడీలు
- నీళ్లడిగిన మక్కల్ రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు
- సర్కార్ పై విరుచుకుపడ్డ హరీష్ రావు



రైతులకు 8గంటలు కూడా కరెంట్ ఇవ్వడంలేదు 3

- మాటల్లోనే 24గంటల విద్యుత్
- చేతల్లో నిలువునా మోసం
- విద్యుత్ ట్రిప్పింగ్ లతో మడులకు నీరందడంలేదు
- హరీష్ రావు విమర్శలు

సింగరేణి చరిత్రను చీకటి చేసిన కాంగ్రెస్



- కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయింది
- కరెంటు కోతకు సింగరేణి బాధ్యున్ని చేస్తే ఎట్లా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ ఉద్యమంలో 42 రోజుల పాటు బొగ్గు ఉత్పత్తి నిలిపివేసిన కార్మికులు
- కేసీఆర్‌కు అండగా నిలిచిన సింగరేణి కార్మిక లోకం



గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

- రైజింగ్ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వాములు కండి
- 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్- 2026'లో మంత్రి శ్రీధర్‌బాబు

మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో భార్యకు ఉరిశిక్ష

- ముస్కాన్ రస్తోగి, సాహిల్ శుక్లాలకు మరణశిక్ష విధించిన కోర్టు
- తీర్పులో భగవద్గీత, ధర్మసూత్రాలను ప్రస్తావించిన న్యాయమూర్తి





ఉప్పల్ స్టేడియంలో బతుకమ్మ, కళారూపాలు

- క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించిన పర్యాటక శాఖ

ప్రపంచస్థాయి సాంకేతికతతో జౌళి రంగానికి కొత్త దిశ

- యూకే సంస్థలతో రెండు కీలక ఒప్పందాలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో వేధింపులు

- జూబ్లీహిల్స్‌లో శ్రీచైతన్య గురూజీపై కేసు నమోదు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్యకు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
- ప్రశ్నించిన భర్తను చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదు



పెట్టుబడులకు పూర్తి భద్రత

హైదరాబాద్, 4,(సిరి న్యూస్) అక్టోబర్ 14 :

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. డాక్టర్ మురి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బ్రిటన్‌లోని యార్‌క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బుధవారం సమావేశమైంది. సౌత్ యార్‌క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్‌క్‌షైర్ మేయర్ డేవిడ్ స్మెత్, వెస్ట్ యార్‌క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఈ బృందానికి నాయకత్వం వహించారు. ఇటీవల భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాక ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు. డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక తెలంగాణ రైజింగ్ 2047 గురించి వివరించారు. 2025 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్ రివర్‌ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా బ్రిటన్ ప్రతినిధులు తెలంగాణతో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యా సంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి రాష్ట్రంలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు. సౌత్ యార్‌క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ మాట్లాడుతూ యార్‌క్‌షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన సుమారు 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిపారు. దేశంలో అత్యధిక తలసరి జీవీఏడీపీ కలిగిన రాష్ట్రంగా ప్రస్తావిస్తూ రెండు ప్రాంతాల ఆర్థిక ప్రయోజనాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. వెస్ట్ యార్‌క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ మాట్లాడుతూ యార్‌క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని, రెండు ప్రాంతాలు సోదర భావంతో కలిసి పనిచేసే అవకాశాలున్నాయని చెప్పారు. అంతకు ముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బ్రిటన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. జీనోమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, క్లీన్ ఎనర్జీ, నాలెడ్జ్ ఆధారిత ఆర్థికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఉత్తర ఇంగ్లండ్ ప్రాంతానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలతో తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు మంచి అనుసంధానం ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం బ్రిటన్‌లో పర్యటించి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ కేంద్రంగా ఎదిగే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూకేఇండియా సెటా అండ్ రీజినల్ సినర్జీస్ పేరుతో యూకే ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూకేఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై సీఎం ఆగ్రహం..

హైదరాబాద్,4,(సిరి న్యూస్) అక్టోబర్ 14:

తెలంగాణలో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సజావుగా సాగేందుకు పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీతో సహా ఎవరినీ ఉపేక్షించబోనని, అవసరమైతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

యాదాద్రి ప్లాంట్‌పై నిలదీత

నైనీ, మహానది బొగ్గు గనుల నుంచి బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాలకు గల కారణాలను వెంటనే నివేదించాలని అధికారులను ఆదేశించారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ అందించాలని స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందని, అధికారులు కూడా తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు.

ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ అంతరాయాలు తదితర అంశాలపై బుధవారం ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా నెలకొన్న పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పశుసంపద సంరక్షణకు, పశుగ్రాసం కొరత నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినోను విపత్తుగా పరిగణించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలానికి గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులను నియమించి పరిస్థితులను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. మండలాల వారీగా పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం అందేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

వెలుగుల బాటలో తెలంగాణ

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికలు

ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. ఎండల తీవ్రత పెరిగి గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతున్నా, ఎక్కడా కోతలు లేకుండా ప్రణాళికాబద్ధంగా సరఫరాను క్రమబద్ధీకరిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల ఆధునీకరణ ద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించి, చివరి ఆయకట్టు రైతులకు కూడా మోటార్లు కాలిపోకుండా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రిడ్ వ్యవస్థను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.3,477 కోట్ల పెట్టుబడులు

డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అచ్చంపేట నియోజకవర్గంలో విద్యుత్ నెట్‌వర్క్ అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలకు కలిపి మొత్తం రూ.339.68 కోట్లు వెచ్చించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కింద 42,149 మంది రైతులకు, గృహజ్యోతి కింద 37,647 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామన్నారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా రూ.1,014.88 కోట్లతో 8 కొత్త సబ్‌స్టేషన్లు, 5,177 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 15,576 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి కోసం విద్యుత్ శాఖ ద్వారా ఇప్పటివరకు ఏకంగా రూ.3,477 కోట్లను కేటాయించి పంపిణీ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేసినట్లు వివరించారు. తెలంగాణవ్యాప్తంగా టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రూ.39,951 కోట్లను విద్యుత్ మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఖర్చు చేసినట్లు డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో పంపిణీ వ్యవస్థ ఆధునీకరణకు రూ.7,257 కోట్లు, సంక్షేమ రాయితీల కోసం రూ.32,694 కోట్లు వెచ్చించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 174 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 1,09,897 డీటీఆర్‌లు, 40,282 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ లైన్లను నిర్మించడంతో పాటు 2.54 లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రైతులకు అందించామని గుర్తుచేశారు. అచ్చంపేట పట్టణంలో జరిగిన ఈ శంకుస్థాపన మహోత్సవంలో స్థానిక శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రా విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులైన ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, నాగర్‌కర్నూల్ ఎస్ఈ కె.వి. నరసింహారెడ్డి తదితర ఇంజనీరింగ్ యంత్రాంగం హాజరై ప్రాజెక్టు పురోగతిని వివరించారు. ప్రజా సంక్షేమమే ఊపిరిగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.



నాణ్యతా ప్రమాణాల్లో టీజీఎస్పీడీసీఎల్ గుర్తింపు!

మొదటిపేజీ తరువాయి

ఉన్నతాధికారుల సమక్షంలో ఈ ప్రశంసాపత్రాలను ఘనంగా స్వీకరించారు.

నాణ్యతా నిర్వహణలో మేటి..

సంస్థలోని ప్రధాన కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి సబ్‌డివిజన్ల వరకు అన్ని విభాగాల్లో నాణ్యతా నిర్వహణ పద్ధతులను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ఐఎస్ఓ 9001 ధ్రువీకరణ లభించింది. అధికారిక రికార్డుల పక్కా నిర్వహణ, అంతర్గత పరిపాలనా పర్యవేక్షణ, విధుల్లో ఉద్యోగుల జవాబుదారీతనం, రోజువారీ కార్యాచరణ ప్రక్రియల నిరంతర ఆధునీకరణకు ఈ సర్టిఫికేషన్ దక్కింది. నిర్ణీత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విధులను నిర్వర్తిస్తూ, సేవల నాణ్యతను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే పాలనా సంస్కరణలకు ఇది గీటురాయిగా నిలిచింది.

సైబర్ ముప్పులకు చెక్..

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో విద్యుత్ గ్రిడ్ నెట్‌వర్క్‌లు, బిల్లింగ్ సమాచారం, లక్షలాది మంది వినియోగదారుల డేటా పరిరక్షణకు టీజీఎస్పీడీసీఎల్ అత్యున్నత ప్రాధాన్యమిస్తోంది. ఐటీ నెట్‌వర్క్‌ల పటిష్ఠత, కీలక డాక్యుమెంట్ల డిజిటల్ పరిరక్షణ, సమాచార ప్రాప్యతపై కట్టుదిట్టమైన నియంత్రణ, సైబర్ దాడులు మరియు ముప్పులను సమర్థంగా అడ్డుకోవడంలో అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నందుకు ఐఎస్ఓ 27001 సర్టిఫికేషన్ దక్కింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ సంస్థ సమాచార గోప్యతను, పారదర్శకతను కాపాడటంలో సంస్థ నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనంగా నిలుస్తోంది.

స్టోర్స్ నిర్వహణలో విప్లవం..

విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌కు అవసరమైన భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, కేబుళ్లు, ఇతర విడిభాగాల నిల్వ, వాటి పంపిణీ నిర్వహణలో అంతర్జాతీయ క్రమశిక్షణను సాధించేందుకు టీజీఎస్పీడీసీఎల్ జపాన్‌లో ప్రాచుర్యం పొందిన ప్రఖ్యాత 5ఎస్ (సార్ట్, సెట్ ఇన్ ఆర్డర్, షైన్, స్టాండర్డైజ్, సస్టెన్) పద్ధతిని దిగ్విజయంగా అమలు చేసింది. స్టోర్స్‌లో వస్తువుల వర్గీకరణ, పరిశుభ్రత, సామగ్రిని సులభంగా గుర్తించే పద్ధతులు, నిల్వల లెక్కలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా అత్యవసర సమయాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యాన్ని గణనీయంగా తగ్గించింది. తద్వారా సంస్థ కార్యాచరణ సామర్థ్యం, మానవ వనరుల ఉత్పాదకత మరింతగా పెరిగాయి.

వినియోగదారుల నమ్మకానికి ప్రతీకగా క్వాలిటీ మార్క్

కోట్లాది మంది గృహ, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయమైన, నమ్మకమైన, హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు గత ఐదేళ్లుగా టీజీఎస్పీడీసీఎల్ చేపట్టిన విప్లవాత్మక చర్యలకు గుర్తింపుగా 'క్వాలిటీ మార్క్' లభించింది. ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, ఆన్‌లైన్ సేవల విస్తరణ, లోఓల్టేజీ సమస్యల నివారణ, వినియోగదారుల సంతృప్తిని ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని ఈ గుర్తింపును కేటాయించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ నిరంతరం సేవా నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి ఈ గుర్తింపు సరికొత్త ప్రోత్సాహాన్ని అందించనుంది.

సమష్టి కృషికి దక్కిన ఫలితం..

ప్రభుత్వ నిరంతర మార్గదర్శకత్వం, క్షేత్రస్థాయి లైన్‌మెన్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరి అంకితభావం, సమష్టి కృషితోనే ఈ అంతర్జాతీయ గుర్తింపులు సాధ్యమయ్యాయని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. నాణ్యతను కేవలం కాగితపు ధ్రువపత్రాలకే పరిమితం చేయకుండా, సంస్థలోని ప్రతి ప్రక్రియలో క్రమశిక్షణను, ప్రతి పనిలో జవాబుదారీతనాన్ని పాటిస్తూ వినియోగదారులకు మరింత చేరువవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. నరసింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్‌కుమార్, సీఈ బాలస్వామి తదితర ఇంజనీరింగ్ యంత్రాంగం పాల్గొని సంస్థ సాధించిన ప్రగతిని కొనియాడారు.

లీడ్ ఆడిటర్ శిక్షణ పూర్తి చేసిన
టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ అనిల్ కుమార్

హైదరాబాద్ అక్టోబర్ 14, (సిరి న్యూస్):



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా కంపెనీ సెక్రటరీ ఓరుగంటి అనిల్ కుమార్ కు క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో లీడ్ ఆడిటర్ శిక్షణ పూర్తి చేసినందుకు సంబంధించిన సర్టిఫికెట్ అందజేశారు.

తెలంగాణకు రహదారుల అభివృద్ధిలో కీలక ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ :

తెలంగాణ రాష్ట్రంలో రహదారులు, రవాణా సౌకర్యాల అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశంలో చర్చించినట్లు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. న్యూఢిల్లీలో సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా రాష్ట్రంలో చేపట్టాల్సిన కీలక మౌలిక వసతుల పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు ప్రతిపాదనలు సమర్పించగా, వాటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని జూపల్లి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా రహదారుల విస్తరణ, రవాణా సౌకర్యాల మెరుగుదల, కొత్త వంతెనల నిర్మాణం, కేంద్ర నిధుల కేటాయింపు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు వివరించారు.

ఏ పక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

హైదరాబాద్, అక్టోబర్ 14 4,(సిరి న్యూస్):

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పరిమితమైతే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు రూ.వందల కోట్లT ఉన్నప్పటికీ పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరుచోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లT మంజూరు చేశామని, ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్టుమెంటుకు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులు సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతోపాటు ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మాతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పని తీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

వచ్చే దసరాకు మొదటి దశ ఇళ్ల పూర్తి : మంత్రి దుద్దిళ్ల

మొదటి దశలో కేటాయింపులు జరిగిన ఇందిరమ్మ ఇళ్లను ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ఐటీ, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఏళ్లతరబడి నిర్మాణాలు కొనసాగేవని, అలాంటి పరిస్థితి ఇప్పుడు ఉండదని అన్నారు. పోచారంలో 480 మందికి కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగించారు. ఇందిరమ్మ టవర్స్‌కు రోడ్లు, మంచినీటి సదుపాయం, లిఫ్ట్ వంటి మౌలిక సదుపాయాలను గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే హామీ ఇచ్చిన మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, తెల్ల రేషన్ కార్డులపై ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని పేదలకు వారి సొంత నియోజకవర్గం పరిధిలోనే ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తున్నామని చెప్పారు. పోచారం ప్రాంతంలో సింగిల్ బెడ్‌రూం కొనాలన్నా రూ.40 లక్షలు ఖర్చవుతుందని, అలాంటిది రూ.6 లక్షలు భరిస్తే అంతకంటే విలువైన ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఇళ్ల కేటాయింపులు అత్యంత పారదర్శకంగా మానవ ప్రమేయం లేకుండా లాటరీ పద్ధతిలో జరుపుతున్నామని చెప్పారు.

పాలమూరు జిల్లాలో మళ్లీ వలసల దుస్థితి

గద్వాల,, అక్టోబర్ 144,(సిరి న్యూస్) :

పాలమూరు జిల్లా నుంచి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆనాటి రోజులు తెస్తా.. పాత రోజులు తెస్తా అన్నాడు.. చెప్పినట్లే పాలమూరుకు పాత వలసల రోజులు తీసుకొచ్చాడని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. గద్వాల జిల్లా ఇందువాసి గ్రామంలో దాదాపు 40 దళిత కుటుంబాలు కూలి పనుల కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకకు వెళ్లి యాదగిరి జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురవడంతో బుధవారం ఆయన వారిని పరామర్శించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించడగా మరో ఇద్దరి పరిస్థితి విషయమంగా వుంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ స్పందించి బాధితులను పరామర్శించి సహాయం అందించమని అదేశించగా ప్రమాదంలో మరణించిన ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చి బీఆర్ఎస్ తరపున వారికి తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంతవరకు ఈ సంఘటనపై కలెక్టర్, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధితులకు రూ.10లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, తీవ్రంగా గాయపడ్డ వారికి ప్రభుత్వం తరపున మెరుగైన పూర్తి ఉచిత వైద్యం అందిస్తూనే తగిన ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. సాగునీరు రాక, కరెంట్ లేక, చేతినిండా కూలి దొరకక మళ్లీ వలసలు మొదలయ్యాయి. ఈ గ్రామంలో ఎవరిని కదిలించినా కరెంట్ రావడం లేదని, కరెంట్ పరిస్థితి ఘోరంగా మారిందని లబోదిబోమంటున్నారన్నారు. కనీసం 67 గంటల కరెంట్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారన్నారు. మేం ఇక్కడికి వస్తుంటే మార్గమధ్యంలో మల్లకల్, అయిజలో రైతులు మా కారును ఆపి సార్, రేవంత్ రెడ్డిని గట్టిగా నిలదీయండి.. నేను రైతును, ఎనిమిది ఎకరాల్లో పంట వేస్తే కరెంట్ రాక నిలువునా ఎండిపోతోంది అని ఎంతో ఆవేదనతో మొరపెట్టుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పల్లె పల్లె పాలమూరులోన పల్లేర్లు మొలిసెనా అంటూ వలసల వేదనపై పాటలు పాడుకున్న దుస్థితి ఉండేది. కానీ రాష్ట్రం వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ చూపి నెట్టంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి లాంటి పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. దాదాపు రూ. 4 వేల కోట్లు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున చెక్ డ్యామ్‌లు నిర్మించి, చెరువులు బాగుచేసి పాలమూరు జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ఇందువాసి గ్రామానికి కూడా నెట్టంపాడు నీళ్లను పారించింది బీఆర్ఎస్సే. 24 గంటల కరెంట్, రైతుబంధు ఇచ్చి ఆదుకున్నాం. దాంతో గ్రామం పత్తి, పొగాకు, మొక్కజొన్న విత్తన పంటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, పెద్ద పెద్ద సీడ్ కంపెనీలు ఇక్కడికి వచ్చి రైతులతో ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రామస్తులందరికీ పుష్కలంగా ఉపాధి దొరికింది. గతంలో కేటీఆర్ వచ్చినప్పుడు రోడ్డుపై కూలీలను పలకరిస్తే మేము కర్ణాటక నుంచి, కర్నూలు నుంచి గద్వాలకు కూలి పనుల కోసం వలస వచ్చామని చెప్పిన పరిస్థితి ఉండేది. ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైంది. ఆనాడు కేసీఆర్ పాలనలో బొంబాయి, దుబాయ్ పోయిన పాలమూరు బిడ్డలు తిరిగి సొంత గ్రామాలకు వచ్చి గౌరవంగా వ్యవసాయం చేసుకుని బతికారు. కానీ కాంగ్రెస్ పాలన రాగానే మళ్లీ వలసలు ప్రారంభమయ్యాయి. సీఎం సొంత జిల్లాలోని ఈ గ్రామం నుంచి 40 దళిత కుటుంబాలు పొట్టచేతపట్టుకుని కర్ణాటకకు వలసపోయే దుస్థితి వచ్చిందంటే రేవంత్ రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలి, ప్రజలకు క్షమాపణ చెప్పాలి.నీ పాలనలో నీ జిల్లాలోని వలసకూలీలకు కూడా నువ్వు న్యాయం చేయలేకపోయావు. కేసీఆర్ గారు వలసపోయినోళ్లను వాపస్ తెస్తే, నువ్వు మాత్రం పాలమూరు బిడ్డలను మళ్లీ వలసపాలు చేశావు.దీనికి ముమ్మాటికీ కరెంట్ ఇవ్వకపోవడం, నీళ్లు ఇవ్వకపోవడమే కారణం. నెట్టంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టుల్లో 24 గంటలు నడపాల్సిన మోటార్లను 89 గంటలే నడిపి నీళ్లు ఎత్తకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి జనం వలసబాట పట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు ఇచ్చారా? ఒక్క చెక్ డ్యామ్ కట్టారా? ఒక్క చెరువునైనా బాగుచేశారా?కేసీఆర్ గారు కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాంటి ప్రాజెక్టులను, వాటి మోటార్లను కూడా నడపడం చేతకావడం లేదు. కల్వకుర్తి, నెట్టంపాడు, భీమాల్లో 24 గంటలు నడవాల్సిన మోటార్లను 78 గంటలే ఎందుకు నడుపుతున్నారు?ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ అసమర్థత తెచ్చిన కరువు. నీళ్లు ఎత్తకపోవడం, కరెంట్ ఇవ్వకపోవడం వల్ల పాలమూరుకు రేవంత్ రెడ్డి రూపంలో గ్రహణం పట్టింది.శ్రీశైలంలో నీళ్లున్నా ఐదు మోటార్లు నడపాల్సిన చోట రెండే మోటార్లు నడుపుతున్నారు. లోవోల్టేజీతో రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి, బోర్ల నుంచి నీళ్లు రావడం లేదు.మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రజలను భయపెడుతూ 'ఎల్‌నినో' వల్ల కరువు వచ్చిందని సాకులు చెబుతున్నారు. ఎల్‌నినోకు బొగ్గు కొరతకు ఏం సంబంధం?బొగ్గు లేక కరెంట్ ఉత్పత్తి ఆగిపోయింది మీ చేతగానితనం వల్ల కాదా? ఇది ఎల్‌నినో కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ వైఫల్యం తెచ్చిన 'ఎల్‌కాంగో' కరువు. పక్క రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నీళ్లను 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో పారిస్తున్నాడు. వెలిగొండ ప్రాజెక్టును మొదలుపెట్టి రాయలసీమలో నీళ్లు పారిస్తూ జలహారతులు పడుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో క్రాప్ హాలిడే లేదు.. కానీ తెలంగాణలో క్రాప్ హాలిడే ఎందుకు వచ్చింది? గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ నుంచే కదా కిందికి పోవాలి..తెలంగాణలో నీళ్లను ఒడిసిపట్టకుండా రేవంత్ రెడ్డి విడిచిపెట్టడం వల్లే కదా చంద్రబాబు ఒడిసిపట్టిడు..పక్కనే కృష్ణమ్మ పారుతున్నా మన ఇందువాసిలో నీళ్లు లేవు. కరెంట్ లేక మిరప, పత్తి పంటలు ఎక్కడికక్కడ ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కేసీఆర్ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 80 శాతం పూర్తి చేసి, 50 టీఎంసీలు నింపుకునే రిజర్వాయర్లు, టన్నెళ్లు, పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు నిర్మించి సిద్ధం చేశారు.ప్యాకేజీ3 లో మూడు నెలలు గట్టిగా పనిచేస్తే పూర్తయ్యే చిన్న పనిని మూడేళ్లయినా ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. ఆ పని పూర్తి చేసుంటే శ్రీశైలం నుంచి 50 టీఎంసీల నీళ్లు ఎత్తిపోసి పాలమూరు నెత్తిమీద కుండలా పెట్టుకునేవాళ్లం.. జిల్లాలో అసలు కరువు అనే మాటే ఉండేది కాదు.మీ చేతగానితనం, నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు కరోనా మహమ్మారి వచ్చినా నీళ్లు ఆగలేదు, కరెంట్ ఆగలేదు, రైతుబంధు ఆగలేదు.రైతును కేంద్రంగా చేసుకుని పాలన సాగింది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దేవుడి మీద ఒట్లు పెట్టి రుణమాఫీ ఎగ్గొట్టింది, మూడు పంటల రైతుబంధు ఎగ్గొట్టింది, రైతుబీమాను రద్దు చేసింది.నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17తో ఒక విషయం స్పష్టమైంది. 24 గంటల ఉచిత కరెంటుకు కాంగ్రెస్ పార్టీ ఉరివేసింది.ఆ ఉరే జీవో 17. వ్యవసాయం కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' పెట్టి, దానికి కేవలం సోలార్ పవర్‌ను మాత్రమే కేటాయించారు. సోలార్ పవర్ అంటే ఉదయం 78 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే పోతుంది.అంటే రైతులకు 67 గంటల కరెంటుకు మించి ఇచ్చేది లేదని జీవో 17 ద్వారా ప్రభుత్వం అధికారికంగా తేల్చేసింది. ఇకపై రైతులకు రాత్రిపూట కరెంట్ రాదు, కేసీఆర్ ఇచ్చినట్లు 24 గంటల కరెంటూ రాదు. ఇదే జిల్లాలో తిరుగుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా.. 24 గంటల కరెంట్ ఇస్తారా ఇవ్వరా? రైతులంటే ఎందుకంత చిన్నచూపు? రైతు అనగానే మీ చేతులకు కోతలు ఎందుకు పడుతున్నాయి..ఎన్నికల మేనిఫెస్టోలో, అసెంబ్లీ బడ్జెట్లో పెట్టి బల్లలు చరిచి మరీ వ్యవసాయ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద ఏటా రూ. 12,000 ఇస్తామని చెప్పారు.

రైతులకు 8గంటలు కూడా కరెంట్ ఇవ్వడంలేదు

గద్వాల, అక్టోబర్ 14 4,(సిరి న్యూస్):

గద్వాల నిజయోకవర్గం గట్టు మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని ఉదయం నుంచి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని హరీష్రావు తెలిపారు. గట్టు మండలంలో సాగునీరు, విద్యుత్ అందక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి విద్యుత్ సరఫరా తీరును పరిశీలించేందుకు గట్టు మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం 78 గంటల కరెంట్ కూడా రావడం లేదని, మధ్యమధ్యలో పదేపదే ట్రిప్ అవుతూ మోటార్లు నడవక పంటలు ఎండిపోతున్నాయని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు.రైతుల ఆవేదన వాస్తవమా కాదా అని స్వయంగా నిర్ధారించుకోవడానికే తామంతా గట్టు సబ్‌స్టేషన్‌కు వచ్చి అధికారుల అధికారిక లాగ్‌బుక్‌ను స్వయంగా పరిశీలించానన్నారు.నిన్న అక్టోబర్ 13 లాగ్‌బుక్ రికార్డుల ప్రకారం రైతులకు ఇచ్చిన త్రీఫేస్ కరెంట్ కేవలం 7 గంటల 50 నిమిషాలు మాత్రమే. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 8 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోయింది. ఆ ఇచ్చిన 7 గంటల 50 నిమిషాల్లో కూడా నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వలేదు. అందులోనూ మూడు సార్లు విద్యుత్ సరఫరాను బంద్ చేశారు. ఒకసారి గంట సేపు, మరోసారి ఐదు నిమిషాలు, ఇంకోసారి పది నిమిషాల పాటు కరెంట్ నిలిపివేశారు. ఇచ్చిన అరకొర సమయంలోనే మూడు నాలుగు సార్లు కరెంట్ కోతలు పెట్టడం సిగ్గుచేటు.ఇలా పదేపదే విద్యుత్ ట్రిప్ అవ్వడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. బోరు ఆన్ చేసి నీళ్లు పారేలోపే కరెంట్ పోతోంది, మళ్లీ వచ్చినప్పుడు మొదట పారిన మడే పారుతోంది తప్ప వెనక మళ్లకు నీళ్లు అందడం లేదు. ఫలితంగా చివరి మళ్లకు చుక్క నీరు అందక పంటలన్నీ రైతుల కళ్లముందే నిలువునా ఎండిపోతున్నాయి.కేసీఆర్ 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం 7 గంటల 50 నిమిషాల కరెంటు ఇచ్చి అందులోనూ గంటల కొద్దీ కోతలు విధిస్తూ అన్నదాతల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. లాగ్‌బుక్ ఆధారంగా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను నిలదీస్తే చేదు నిజాలు బయటపడ్డాయి. మేం ఏం చేస్తాం సార్.. పైనుంచి బంద్ చేయమంటే బంద్ చేస్తాం, ఆన్ చేయమంటే ఆన్ చేస్తాం.. మా ఫోన్లకు అధికారుల నుంచి బంద్ చేయమని మెసేజ్‌లు వస్తాయి తప్ప మా చేతుల్లో ఏమీ లేదు.. పైనుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంత కరెంట్ ఇస్తే అంతే ఇస్తాం అని ఆపరేటర్ తన ఫోన్ చూపిస్తూ స్పష్టం చేశాడు. దీన్నిబట్టి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పైనుంచే రైతుల కరెంట్‌ను కట్ చేస్తోందని రుజువైందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైదరాబాద్ ముఖ్యం, హైటెక్ సిటీ ముఖ్యం, బడా పరిశ్రమలు ముఖ్యం.. కానీ పల్లెల్లోని పేద రైతులు మాత్రం ముఖ్యం కాదు.అందరూ వాడుకున్న తర్వాత కరెంట్ ఏమైనా మిగిలితే, ఆ మిగిలిన లోవోల్టేజ్ కరెంటును గట్టు ప్రాంత రైతులకు ఇస్తున్నారు. ఒకవేళ హైదరాబాద్‌కో, పరిశ్రమలకో ఎక్కువ విద్యుత్ అవసరమైతే వెంటనే గట్టు సబ్‌స్టేషన్‌కు, ఇక్కడి రైతులకు కరెంట్ బంద్ చేస్తున్నారు. నగరాలకు, ఐటీ కంపెనీలకు నిరంతరాయంగా విద్యుత్ ఇచ్చి, రైతుల కరెంటుకు మాత్రం ఎసరు పెడుతున్నారు. కేసీఆర్ కు, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న ప్రధాన తేడాను రైతాంగం స్పష్టంగా గమనించాలని కోరారు. కేసీఆర్ రైతును దేశానికి వెన్నెముకగా భావించి, మొదట రైతులకు కడుపునిండా 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చి ఆ తర్వాత మిగిలిన విద్యుత్‌ను పరిశ్రమలకు, ఇతర అవసరాలకు సర్దుబాటు చేశారు.కానీ నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్‌కు, పరిశ్రమలకు కడుపునిండా కరెంట్ ఇచ్చి.. చివరకు మిగిలిన అడుగుబొడుగు లో వోల్టేజ్ విద్యుత్‌ను అన్నదాతల ముఖాన కొడుతోంది. ఈ మోసపూరిత విధానాన్ని రైతు సోదరులు గుర్తించి రేవంత్ సర్కార్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

సింగరేణి చరిత్రను చీకటి చేసిన కాంగ్రెస్

గోదావరిఖని, అక్టోబర్ 14:

సింగరేణి కార్మికుల త్యాగాలు, తెలంగాణ ఉద్యమంలో వారు పోషించిన పాత్రను ఎప్పటికీ మరిచిపోలేమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి సింగరేణి కార్మికులు బలంగా అండగా నిలిచారని గుర్తుచేశారు. గోదావరిఖని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన మాట్లాడారు. సింగరేణికి 137 ఏళ్ల చరిత్రఉందని, ఈ ప్రస్థానంలో కార్మికుల శ్రమ, త్యాగాలు అంతర్భాగమని కేటీఆర్ పేర్కొన్నారు. బొగ్గు గనుల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయినవారు, శాశ్వత వైకల్యానికి గురైనవారు ఎంతోమంది ఉన్నారని చెప్పారు.

ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ

బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యమాల్లోనూ సింగరేణి కార్మికులు ముందున్నారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు సకల జనుల సమ్మెలో కార్మికులు 35 రోజులు, మరోసారి ఏడు రోజులు కలిపి మొత్తం 42 రోజులపాటు బొగ్గు ఉత్పత్తిని నిలిపివేశారని గుర్తుచేశారు. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన పోరాటాని కి సింగరేణి కార్మిక లోకం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలోనూ కార్మికులు ఆయనకు మద్దతుగా ఉద్యమించారని తెలిపారు. కేసీఆర్ 11 రోజుల పాటు దీక్ష కొనసాగించిన సందర్భంలో సింగరేణి కార్మికులు ఏడు రోజుల పాటు ఆయనతో కలిసి పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. సాధారణంగా కార్మిక సంఘాలు వేతనాలు, బోనస్‌లు, హక్కుల కోసం పోరాడతాయని, తెలంగాణలో మాత్రం కార్మికులు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కూడా ఉద్యమించారని అన్నారు. అలాంటి పోరాట చరిత్ర కలిగిన గడ్డ గోదావరిఖని అని కేటీఆర్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ..

- **24న రాహుల్, ప్రియాంక రాక**

హైదరాబాద్, అక్టోబర్ 14:

ఇండీ కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఈ సభకు హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు లక్ష మందిని సమీకరించి సభను విజయవంతం చేయాలని నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఢిల్లీలో ఇండీ కూటమి చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరవుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారంపై భవిష్యత్తు కార్యాచరణను చర్చిస్తున్నారు.

సీఈసీ తొలగింపే లక్ష్యం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నివాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. సీఈసీ వ్యవహారశైలి కారణంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆరోపించారు.

ఉప్పల్ స్టేడియంలో బతుకమ్మ, కళారూపాలు

- **క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించిన పర్యాటక శాఖ**

హైదరాబాద్, అక్టోబర్ 14 4,(సిరి న్యూస్):

ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్‌వెస్టిండీస్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యాటక ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేసే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వైభవాన్ని స్టేడియంలో ప్రదర్శించారు. బతుకమ్మ సంప్రదాయాలు, వేడుకల ద్వారా రాష్ట్ర ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును క్రికెట్ అభిమానులకు పరిచయం చేశారు. ప్రకృతితో మానవ సంబంధం, సామూహిక భాగస్వామ్యం, తెలంగాణ ప్రజల జీవన విధానంలో అంతర్భాగమైన సాంస్కృతిక విలువలను బతుకమ్మ పండుగ ప్రతిబింబించింది. స్థానిక కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ జానపద కళారూపాలు ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. తెలంగాణకు ప్రత్యేకమైన జానపద సంగీతం, నృత్యాలు, సాంప్రదాయ కళాప్రదర్శనలను ఆవిష్కరించారు. క్రీడా ఉత్సాహానికి సాంస్కృతిక వైభవాన్ని జోడిస్తూ, క్రికెట్ అభిమానులకు క్రీడలు, సంస్కృతి, వినోదం కలగలిసిన ప్రత్యేక అనుభూతిని కలిగించారు. పర్యాటక ప్రచార కార్యక్రమంలో భాగంగా మ్యాచ్ విరామ సమయంలో తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన పర్యాటక ప్రచార చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రంలో రాష్ట్రంలోని చారిత్రక కోటలు, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి సౌందర్యంతో అలరించే పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక సాంస్కృతిక అనుభవాలు, బతుకమ్మ పండుగ వైభవం వంటి విశేషాలను ప్రదర్శించారు. తెలంగాణలోని వైవిధ్యభరితమైన పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, రాష్ట్రాన్ని సందర్శించేలా పర్యాటకులను ప్రోత్సహించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యం. అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికను సాంస్కృతిక, పర్యాటక ప్రచారానికి వినియోగించడం ద్వారా రాష్ట్ర సంప్రదాయాలు, వారసత్వ సంపదను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా పరిచయం చేయడానికి పర్యాటక శాఖ కృషి చేసింది.

ఇలాంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ రాష్ట్ర జీవన సంప్రదాయాలను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులకు గుర్తింపు కల్పించడం, చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక వైవిధ్యంతో కూడిన పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పడం కొనసాగిస్తోంది.

ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో వేధింపులు

హైదరాబాద్, అక్టోబర్ 14 4,(సిరి న్యూస్):

ఆధ్యాత్మిక సాధన పేరుతో ఓ కుటుంబంలో వివాదం తలెత్తిన ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది. ఆధ్యాత్మిక కేంద్రానికి వచ్చే మహిళకు అసభ్యకరమైన సందేశాలు పంపడంతో పాటు, ప్రశ్నించిన ఆమె భర్తను బెదిరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 71లో 'శ్రీవిద్యా సాధనా సెంటర్' పేరుతో మేరెడ్డి సునీల్‌రెడ్డి అలియాస్ శ్రీచైతన్య గురూజీ ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. స్రవంతి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విష్ణుదీప్‌రెడ్డి భార్య మానసిక ప్రశాంతత కోసం ఈ కేంద్రానికి వెళ్తుండేది. ఈ క్రమంలో కేంద్రం నిర్వాహకుడు ఆమెకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ, వ్యక్తిగతంగా చాటింగ్ చేసినట్లు విష్ణుదీప్‌రెడ్డి ఆరోపించారు.

ప్రశ్నించడంతో బెదిరింపులు

తన భార్యకు పంపిన సందేశాలను గుర్తించిన విష్ణుదీప్‌రెడ్డి.. కేంద్రానికి వెళ్లి నిర్వాహకుడిని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో తనను చంపేస్తానని, మళ్లీ అక్కడికి వస్తే ప్రాణాలతో వదిలిపెట్టనని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో జూబ్లీహిల్స్ పోలీసులు సునీల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆరోపణలపై పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది.

ప్రపంచస్థాయి సాంకేతికతతో జౌళి రంగానికి కొత్త దిశ

హైదరాబాద్, అక్టోబర్ 14 4,(సిరి న్యూస్):

రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానిస్తూ టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ విద్యా, పరిశ్రమ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక అవగాహన ఒప్పందాలను బుధవారం కుదుర్చుకుందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంతోపాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, పరిశ్రమలకు అవసరమైన శిక్షణను అందించడం, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

హడర్స్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంతో తొలి ఎంఓయు


యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హడర్స్‌ఫీల్డ్, తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ మధ్య కుదిరిన తొలి అవగాహన ఒప్పందం ద్వారా రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి సహకారం అందనుంది. ఉమ్మడి విద్యా కార్యక్రమాల నిర్వహణకు అవకాశాలను అన్వేషించడం, విజిటింగ్ అకడమిక్ సిబ్బంది నియామకం, అధ్యాపకులు, విద్యార్థుల పరస్పర మార్పిడిని ప్రోత్సహించడం వంటివి ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం అని మంత్రి పేర్కొన్నారు. అలాగే టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అవసరమైన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదపడనుందన్నారు.

టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రెండో ఒప్పందం

యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని చేనేత, జౌళి, హస్తకళల విభాగం రెండో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో వృత్తి విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా 3డి వీవింగ్, కాంపోజిట్ మెటీరియల్స్ వంటి ఆధునిక సాంకేతిక వస్త్రాల తయారీ, పరిశోధన, శిక్షణపై దృష్టి సారించనున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, అంతర్జాతీయ నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చ

మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో భార్యకు ఉరిశిక్ష

- ముస్కాన్ రస్తోగి, సాహిల్ శుక్లాలకు మరణశిక్ష విధించిన కోర్టు
- తీర్పులో భగవద్గీత, ధర్మసూత్రాలను ప్రస్తావించిన న్యాయమూర్తి
- భర్త సౌరభ్‌ను హత్య చేసి ముక్కలుగా నరికి డ్రమ్‌లో వేసిన నిందితులు
- 126 విచారణలు.. 22 మంది సాక్షుల వాంగ్మూలాల పరిశీలన



మీరట్, అక్టోబర్ 14:


దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీరట్ 'బ్లూ డ్రమ్ హత్య' కేసులో న్యాయ స్థానం కీలక తీర్పు వెలువరించింది. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో భార్య ముస్కాన్ రస్తోగి, ఆమెకు సహకరించిన సాహిల్ శుక్లాలకు ఉరిశిక్ష విధించింది. బుధవారం తీర్పు వెలువరిస్తూ న్యాయమూర్తి అరవింద్ కుమార్ మిశ్రా మహాభారతంలోని భగవద్గీతలోని ధర్మసూత్రాలను ప్రస్తావించినట్లు బాధితుడి తరపు న్యాయవాది మీడియాకు వెల్లడించారు. తీర్పు సందర్భంగా తప్పు చేసిన వారిని శిక్షించడం ధర్మంలో భాగమనే భావనను న్యాయమూర్తి ప్రస్తావించినట్లు న్యాయవాది తెలిపారు. కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన ఉపదేశాన్ని ఉదహరించారు. సొంత వారితోనే యుద్ధం చేయాల్సి వస్తుందన్న ఆందోళనలో ఉన్న అర్జునుడికి కర్తవ్యం, ధర్మం గురించి శ్రీకృష్ణుడు వివరించిన అంశాలను న్యాయమూర్తి గుర్తుచేసినట్లు చెప్పారు.

డ్రమ్‌లో మృతదేహం ముక్కలు

విదేశాల్లో మర్చంట్ నేవీ అధికారిగా పనిచేస్తున్న సౌరభ్ రాజ్‌పుత్ భారత్‌కు వచ్చిన కొద్దిరోజులకే హత్యకు గురయ్యాడు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి, అనంతరం అతడిని హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికినట్లు కేసులో ఆరోపణలు ఉన్నాయి. ఆ ముక్కలను డ్రమ్‌లో వేసి సిమెంట్‌తో కప్పిపెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో మొత్తం 126 సార్లు విచారణ జరగగా, 22 మంది సాక్షుల వాంగ్మూలాలను కోర్టు పరిశీలించింది. తీర్పుకు ముందు ముస్కాన్ తల్లిదండ్రులు సైతం తమ అల్లుడు సౌరభ్ మంచి వ్యక్తి అని పేర్కొన్నట్లు సమాచారం. దోషులకు మరణశిక్ష విధించినా తాము వ్యతిరేకించబోమని వారు చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీని వెంబడిస్తున్న కేసులు..

- ఎనిమిదేళ్ల నాటి కేసులో కొత్తగా సమన్లు..
- వివిధ కేసులు నమోదు..



న్యూ ఢిల్లీ, అక్టోబర్14:

ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీని పాత కేసులు వెంబడిస్తున్నాయి. ఆయన మరోసారి న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకున్నాడు. 8 ఏళ్ల నాటి కేసులో ఆయనకు కొత్తగా సమన్లు జారీ చేయాలని ఢిల్లీ సాకేత్ కోర్టు ఆదేశించింది. గురుగ్రామ్‌లోని ఆయన ఇంటి చిరునామాలో సమన్లను అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 17న జరుగుతుంది. వికాస్ పాండే అనే వ్యక్తి గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ సమన్లు జారీ చేశారు. ధ్రువ్ రాఠీ న్యాయపరమైన చిక్కుల్లో పడటం ఇదే తొలిసారి కాదు. ఆయనపై ఇతర కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. బీజేపీ నాయకుడు సురేష్ కరమ్షి నఖువా, ధ్రువ్ రాఠీపై సాకేత్ కోర్టులో రూ. 20 లక్షల పరువు నష్టం దావా వేశారు. జూలై 2024లో ధ్రువ్ రాఠీ అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో తనను '' హింసాత్మక, దూషణాత్మక ట్రోలర్'' అని పిలిచాడని ఆరోపించాడు. ఈ కేసులో గతంలో కోర్టు సమన్లు జారీ చేసింది. హిందూ దేవీదేవతలపై, సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ధ్రువ్ రాఠీపై అమిత్ సచ్‌దేవ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 196, 299 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన కోరారు

నాణ్యతా ప్రమాణాల్లో నాలుగు గుర్తింపులు

- కీలక మైలురాయి అధిగమించిన ఎస్పీడీసీఎల్
- విద్యుత్ పంపిణీ రంగంలో మరో ముందడుగు
- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా గుర్తింపులు స్వీకరించిన సీఎండీ

అచ్చంపేట, అక్టోబర్ 14 :

విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్పీడీసీఎల్) మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా సంస్థకు నాలుగు గుర్తింపులు లభించాయి. నాణ్యతా నిర్వహణకు సంబంధించి ఐఎస్‌ఓ 9001, సమాచార భద్రతకు ఐఎస్‌ఓ 27001, స్టోర్స్ నిర్వహణలో జపనీస్ 5ఎస్ విధానం, వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నందుకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు దక్కాయి. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ ఈ నాలుగు గుర్తింపులను స్వీకరించారు. ఐఎస్‌ఓ ఆడిటర్ శివయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నర్సింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ (రూరల్) బాలస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు

నాణ్యతా నిర్వహణకు ఐఎస్‌ఓ 9001

సంస్థలోని కార్యాలయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా నిర్వహణ విధానాలను సమర్థంగా అమలు చేయడం, రికార్డుల నిర్వహణ, అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ, కార్యాచరణ ప్రక్రియలను మెరుగుపరచడం, నిరంతర అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలకు సంబంధించి ఐఎస్‌ఓ 9001 గుర్తింపు లభించింది. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా విధులను నిర్వర్తిస్తూ సేవల నాణ్యతను ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి ఈ ప్రమాణం దోహదపడుతుంది. సంస్థలో జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన నిర్వహణ విధానాలకు ఇది ప్రాధాన్యతనిస్తుంది.

సమాచార భద్రతకు పెద్దపీట

ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఐటీ నెట్‌వర్క్‌లు, కీలక సమాచారం, డేటా పరిరక్షణ, సమాచార ప్రాప్యతపై నియంత్రణ, సైబర్ ముప్పుల నిర్వహణ వంటి అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నందుకు ఐఎస్‌ఓ 27001 గుర్తింపు లభించింది. సంస్థ సమాచార గోప్యత, సమగ్రతను కాపాడటంతోపాటు అవసరమైన సమయంలో సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఈ ప్రమాణం ఉపయోగపడుతుంది.

జంతర్‌మంతర్‌పై పోరాటం మరింత ఉధృతం!

- 16న జాతీయ పతాకాలతో భారీ నిరసనకు అభిజీత్ దీపేక్ పిలుపు
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ
- నిరసన హక్కును తిరిగి సాధిస్తామన్న రాహుల్ గాంధీ
- ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ప్రదర్శనలు
- 24 గంటల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఇండియా కూటమికి పిలుపు
- హైదరాబాద్‌లో భారీ సభకు సన్నాహాలు
- నిరసనలపై ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యలను తిరస్కరించిన కేంద్రం

ఢిల్లీ | అక్టోబర్ 14 :



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్లతో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలు బుధవారం మరింత ఉధృతమయ్యాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిరసన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఈ పరిణామాల మధ్య అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద జాతీయ పతాకాలతో భారీ ప్రదర్శన నిర్వహించాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేక్ పిలుపునిచ్చారు.

జాతీయ పతాకంతో నిరసన నేరమా?

మంగళవారంనాడు జంతర్‌మంతర్‌లోకి ప్రవేశించి నిరసన చేపట్టిన సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే సహా 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో దాస్, రాంకాలను బుధవారం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. అనంతరం తిహార్ జైలుకు తరలించారు. అజింక్య షిండేను ఆరు నెలలపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమన్న షరతుతో రూ.5,000 వ్యక్తిగత పూచీకత్తు, ష్యూరిటీపై విడుదల చేశారు. జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన తర్వాత అనుమతి లేకుండా అక్కడికి ప్రవేశించారని పోలీసులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇచ్చిన శాంతిభద్రతల పూచీకత్తు నిబంధనలను ఉల్లంఘించడంతోపాటు ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదయ్యాయి. అయితే నిరసనకారులు తాము శాంతియుతంగా జాతీయ పతాకాన్ని ప్రదర్శించామని చెబుతున్నారు.

16న కన్నాట్ ప్లేస్‌లో నిరసన

బుధవారం ఢిల్లీకి చేరుకున్న అభిజీత్ దీపేక్ మీడియాతో మాట్లాడుతూ సహచరుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో జాతీయ పతాకాన్ని ఎగురవేయడం నేరంగా మారిందా అని ప్రశ్నించారు. బ్రిటిష్ పాలనలో స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన పరిస్థితులతో ప్రస్తుత చర్యలను పోల్చారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌కు జాతీయ పతాకాలతో రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తామని ప్రకటించారు. అయితే ఈ ప్రదర్శనకు పోలీసుల అనుమతి లభించిందా అన్న విషయం ఇంకా ధ్రువీకరణ కాలేదు. సీజేపీ స్వతంత్ర ప్రజా ఒత్తిడి సంఘంగానే కొనసాగుతుందని, రాజకీయ పార్టీగా నమోదు చేసుకునే ఆలోచన లేదని దీపేక్ స్పష్టం చేశారు. ఇండియా కూటమితో కలిసి పనిచేసే అంశంలో ఉమ్మడి లక్ష్యాలు ఉన్నప్పటికీ తమ స్వతంత్రతను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

24 గంటల్లో ఉద్యమానికి సిద్ధంగా ఉండండి: రాహుల్ గాంధీ

సీజేపీ నాయకుల నిర్బంధాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బుధవారం తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసన సందర్భంగా జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదన్నారు. యువతను జైలుకు పంపడం పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై పోరాడుతున్నప్పటికీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణే అందరి ఉమ్మడి లక్ష్యమని ప్రకటించారు. జంతర్‌మంతర్ ప్రజలదేనని, నిరసన హక్కును తిరిగి సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఇండియా కూటమి నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పౌరసమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. అవసరమైతే 24 గంటల్లో భారీ ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన నిర్ణయాన్ని న్యాయపరంగా సవాలు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. మరో కార్యక్రమంలో పోలీసుల దాడులకు గురయ్యామని ఆరోపిస్తున్న నిరసనకారులతో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. పోలీసు చర్యలకు సంబంధించిన వీడియో ఆధారాలను భద్రపరచి తనకు పంపించాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల ప్రదర్శనలు

ఢిల్లీలో విద్యార్థి, యువజన సంఘాల నిరసనలు బుధవారం కొనసాగాయి. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) సంయుక్తంగా ఫిరోజ్ షా రోడ్డు నుంచి జంతర్‌మంతర్ వైపు నిర్వహించిన ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై విచారణ జరిపించాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కూడా మధ్యాహ్నం పటేల్ చౌక్ మెట్రో స్టేషన్ నుంచి జంతర్‌మంతర్ వైపు ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఎన్ఎస్‌యూఐ నాయకులు పోలీసులపై ఫిర్యాదు చేసేందుకు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది.

సీజేపీకి విస్తరిస్తున్న ప్రతిపక్షాల మద్దతు

సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల నిర్బంధాన్ని రాహుల్ గాంధీతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ బెనర్జీ, శివసేన(యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే తదితరులు ఖండించారు. జాతీయ పతాకాన్ని ప్రదర్శించినందుకు నిర్బంధించడం సమంజసం కాదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. నిర్బంధితులకు న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని స్టాలిన్ ప్రకటించారు.ఈ మద్దతుపై అభిజీత్ దీపేక్ ప్రతిపక్ష నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే సీజేపీ ఇండియా కూటమిలో అధికారికంగా చేరినట్లు ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

హైదరాబాద్‌లో భారీ సభకు సన్నాహాలు

తెలంగాణలోనూ నిరసనలను మరింత విస్తరించేందుకు ఇండియా కూటమి సన్నాహాలు చేస్తోంది. దసరా తర్వాత హైదరాబాద్‌తోపాటు దేశంలోని ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమానికి రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి అగ్రనేతలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అయితే హైదరాబాద్ సభ తేదీ, వేదిక ఇంకా ఖరారు కాలేదు.కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి జంతర్‌మంతర్‌పై ఆంక్షలను విమర్శించారు. ఒక నిరసన స్థలాన్ని తొలగిస్తే దేశవ్యాప్తంగా వందలాది నిరసన కేంద్రాలు ఏర్పడతాయని వ్యాఖ్యానించారు.

ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యలను తిరస్కరించిన కేంద్రం

ఢిల్లీలో నిరసనకారుల సామూహిక నిర్బంధాలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం వ్యక్తం చేసిన ఆందోళనలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం తిరస్కరించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఆ వ్యాఖ్యలు అనుచితమైనవని, భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఇతర దేశాల్లో జరిగే నిరసనలపై ఇదే విధంగా స్పందించకుండా భారతదేశాన్ని ప్రత్యేకంగా విమర్శించడం పక్షపాత వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.

నిరసనలతో వ్యాపారానికి నష్టం: వర్తక సంఘాలు

ఢిల్లీలో నిరసనలు, పోలీసుల బారికేడ్లు, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పలు వర్తక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఖాన్ మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు సంజీవ్ మెహ్రా ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో సాధారణ వ్యాపారంతో పోలిస్తే అమ్మకాలు 80 నుంచి 90 శాతం వరకు తగ్గాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పలు సంఘాలు వినతిపత్రాలు సమర్పించాయి. శాంతియుత నిరసన హక్కును గౌరవిస్తూనే చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీల జీవనోపాధిని కాపాడాలని కోరాయి.

రేపు సుప్రీంకోర్టు విచారణ కీలకం

ఈనెల 10 నుంచి జరిగిన నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలు, నిర్బంధాలు, రవాణా ఆంక్షలు, మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టు ముందున్నాయి. మహిళా జర్నలిస్టులపై దాడుల ఆరోపణలకు సంబంధించి సీనియర్ ఢిల్లీ పోలీసు అధికారి వివరణ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇప్పటికే కోరారు. అక్టోబర్ 15న ఈ అంశంపై తదుపరి విచారణ జరగాల్సి ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఢిల్లీలో గురువారంనిరసన, నిరాహార దీక్ష కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పార్టీ నాయకులు ప్రకటించారు.

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్..

- ఒక్కొక్కరికి రూ.17,951
- 11.40 లక్షల మందికి పైగా నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి
- బోనస్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం.. రూ.2,009 కోట్ల వ్యయం
- కనీస వేతన పరిమితి రూ.7 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని యూనియన్ల డిమాండ్
- పరిమితి పెంచితే ఒక్కొక్కరికి రూ.46,184 బోనస్ ఇవ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:

పండుగల వేళ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దేశవ్యాప్తంగా 11.40 లక్షల మందికి పైగా నాన్‌గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన పనితీరు ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంపై సుమారు రూ.2,009 కోట్ల ఆర్థిక భారం పడనుంది.

రైల్వే ఉద్యోగుల సేవలకు గుర్తింపు

దేశ రవాణా వ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేందుకు రైల్వే ఉద్యోగులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. పండుగల సమయంలోనూ ట్రాక్‌ల నిర్వహణ, రైళ్ల నడపడం, వర్క్‌షాపుల్లో పనులు సహా వివిధ విధుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ బోనస్ ప్రకటించినట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఈ నిర్ణయం ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా ఊరటనివ్వనుంది.

ప్రస్తుతం అమల్లో ఉన్న లెక్కింపు విధానం ప్రకారం కనీస వేతనం రూ.7,000 ప్రాతిపదికన 78 రోజుల బోనస్‌ను లెక్కిస్తున్నారు. ఈ ప్రకారం ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 అందనుంది. ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, గార్డులు, టెక్నీషియన్లతో పాటు గ్రూప్‌సి, గ్రూప్‌డి విభాగాల్లోని అర్హులైన నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు ఈ ప్రయోజనం పొందనున్నారు.

వేతన పరిమితి పెంచాలని డిమాండ్

బోనస్ లెక్కింపునకు ప్రామాణికంగా తీసుకుంటున్న కనీస వేతన పరిమితిని పెంచాలని రైల్వే కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రూ.7,000 పరిమితి 201415 నుంచి కొనసాగుతోందని, గత 11 ఏళ్లుగా మార్పు చేయలేదని ఐఆర్‌టీఎస్ఏ సహా పలు సంఘాలు పేర్కొంటున్నాయి. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని రూ.18,000కు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు బోనస్‌ను లెక్కిస్తే ఒక్కో ఉద్యోగికి రూ.46,184 చొప్పున అందించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.





సీజేపీ నేతలకు ఐదు రోజుల కస్టడీ

- ఆంక్షలు ఉల్లంఘించి మళ్లీ ఆందోళనకు ప్రయత్నించారని ఆరోపణలు
- రూ.50 వేల వ్యక్తిగత బాండ్లపై గతంలో సంతకాలు చేసినట్లు పోలీసుల వెల్లడి
- అక్టోబర్ 19కు తదుపరి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబర్ 14:

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనకు ప్రయత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కోకన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ మహేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. గతంలో శాంతిభద్రతలను కాపాడుతామని బాండ్లు సమర్పించినప్పటికీ, మళ్లీ నిషేధిత ప్రాంతంలో నిరసనకు ప్రయత్నించారని మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ 14న వెలువడిన ఈ ఆదేశాల ప్రకారం తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

బాండ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు

అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసనకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందన్న కారణంతో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్లు 126, 170 కింద ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో ముగ్గురూ శాంతి, సత్ప్రవర్తనను కాపాడేందుకు ఒక్కొక్కరు రూ.50 వేల వ్యక్తిగత బాండ్, ష్యూరిటీ బాండ్ సమర్పించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏడాది పాటు శాంతిభద్రతలను కాపాడతామని వారు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే, తాము ఎలాంటి బాండ్లపై సంతకాలు చేయలేదని సీజేపీ నేతలు చెబుతున్నారు.

జేడీయూ కార్యాలయం గోడ దూకి..

అక్టోబర్ 13న కొందరితో కలిసి సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు జేడీయూ కార్యాలయం గోడ దూకి జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ నినాదాలు చేస్తూ అంతరాయం కలిగించడంతో పాటు ఆంక్షలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ ఐదు రోజుల కస్టడీకి పంపిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు సీజేపీ నేత అజింక్య షిండేకు ఆరు నెలల పాటు శాంతి, సత్ప్రవర్తనను కాపాడాలనే షరతుతో రూ.5 వేల వ్యక్తిగత బాండ్, ష్యూరిటీపై విడుదల చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

భక్తి భావం తో భజనలు... ఘనంగా దేవి నవరాత్రులు



పెద్ద శంకరం పేట, అక్టోబర్ 14, (సిరి న్యూస్):

మెదక్ జిల్లా పెద్ద శంకరం పేట మండలం విరోజిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తున్నారు గ్రామస్థులు. యువతరం లో భక్తి భావం వెళ్ళి విరుస్తుంది. భవాని దీక్షా పరులు కఠినమైన దీక్ష నియమాలు పాటిస్తూ శ్రద్ధగా భవాని నవరాత్రులు నిర్వహిస్తూ భావి తరాలకు ఆదర్శ ప్రాయంగా నిలుస్తున్నారు. మండపం లో వివిధ రకాల పూజలు, నైవేద్యాలు, సేవల ద్వారా తమ భక్తి చాటుకుంటున్నారు. దుర్గా నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు సందర్భంగా భవాని దీక్షా పరులు, గ్రామస్థులు మండపం వద్ద భజనలు కీర్తన లతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం లో దుర్గా భవాని యూత్ అసోసియేషన్ సభ్యులు, అర్చకులు, రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్, బాదినపల్లి శివకుమార్, నక్క నరసింహులు, కుమ్మరి సాయిలు, నరేష్, చిట్టి, భాను, మల్లేశం, ఉపేందర్, యాదగిరి, నక్క సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

గడి కోటలో..


ఇక్కడ నెలకొల్పిన అమ్మవారి విగ్రహం వద్ద కూడా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

కామేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

- **బొంతపల్లిలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు**

గుమ్మడిదల, అక్టోబర్ 14 (సిరి న్యూస్):

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు బుధవారం శ్రీ కామేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల గాజులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది. అమ్మవారి అలంకరణను దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. బుధవారం శ్రీ కామేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని రంగురంగుల గాజులతో సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనానికి అవకాశం



కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తుండటంతో భక్తులు ఆలయానికి వస్తున్నారు. అమ్మవారి వివిధ రూపాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పుడ్ పాయిజన్ తో యువకుడు మృతి







- **సాయిరాం మృతితో నర్సాపూర్ లో కలకలం**
- **మండిల పేరుతో కస్టమర్ల ఆకర్షణ**
- **ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం**
- **విచ్చలవిడిగా రెస్టారెంట్లు**
- **తనిఖీల్లో అధికారుల విపులం**
- **రాజకీయ నాయకుల అండతో రెస్టారెంట్లు ఏర్పాటు**

నర్సాపూర్, అక్టోబర్ 14 : (సిరి న్యూస్)

నర్సాపూర్ పట్టణంలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపుతోంది నర్సాపూర్మెదక్ రోడ్డులో గలవన్ప్యాలెస్రెస్టారెంట్లోమండిభోజనంతిన్న వారికి ఫుడ్ పాయిజన్ అయింది. భోజనం చేసిన నర్సాపూర్ పట్టణంలో ఉండే సుమారు 20 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని కుటుంబీకులు వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరీక్షలు చేసిన వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో సాయిరామ్(19)అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మంగళ వారం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు నర్సాపూర్ పట్టణానికి చెందిన పిట్ల లావణ్య రాజు దంపతుల రెండో కుమారుడు ఫుడ్ పాయిజన్ తో యువకుడు మరణించడంతో కలకలం రేపుతోంది.కొంత మంది భోజనం చేసినవారు కుటుంబ సభ్యులకు రెస్టారెంట్ నుండి పార్సెల్ తీసుకువెళ్లారు వేరేప్రాంతల నుండి వచ్చి బిర్యానీ తిన్న వారి పరిస్థితి ఏమిటి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎంత..? ఇంకా ఎవరైనా అస్వస్థతకు గురయ్యారా.? అన్నది తెలియాల్సి ఉంది అసలు ఆహారం తీసుకున్న వారే ఎందుకు అస్వస్థతకు గురయ్యారు..? ఆహార నాణ్యతలో లోపమా..? లేక మరేదైనా కారణమా..? ఈ ప్రశ్నలకు అధికారుల విచారణతోనే సమాధానం లభించాల్సి ఉంది.

విచ్చలవిడిగా రెస్టారెంట్లు

పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి వాటికి అనుమతులు ఉన్నాయా?
పంటశాలలో దారుణమైన స్థితిలో కనిపిస్తున్న అపరిశుభ్రత,ఎక్స్పైరీ ఆహార పదార్థాలను వాడటం, ఫ్రీజర్లలోకుళ్లినస్థితిలోమాసంలభించడంలాంటివి బయటపడుతున్నాయి. దీంతో రెస్టారెంట్లలో తినాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. బయట ఫుడ్ అంటేనే బయటపడే పరిస్థితి వచ్చింది. యువకుడి మరణానికి కారణమైన రెస్టారెంట్ యజమానులు, చెఫ్ పై కఠిన చర్యలు తీసుకోవాలనే ప్రజల నుండి డిమాండ్లు వస్తున్నాయి ఈ సంఘటనపై అధికారుల చర్యలు ఎలా తీసుకుంటారు తెలియాల్సి ఉంది.

బిగ్ఛాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే సునీత రెడ్డి*

రెస్టారెంట్లో ఆహారం కలుషితం కావడంతో ఫుడ్ పాయిజన్ తో సాయిరాం మృతి చెందడం పట్ల ఎమ్మెల్యేతీవ్రదిగ్భ్రాంతివ్యక్తం చేశారు.ఈఘటనలో ప్రాణాలు కోల్పోయిన సాయిరాం కుటుంబ సభ్యులకు ఆమె తన ప్రగాఢసానుభూతినితెలియజేశారు. ఈఘటనలోఅస్వస్థతకుగురైన మిగిలిన 19మంది ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారనిబాధితులకు నాణ్యమైనవైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారి

ఫుడ్ సేఫ్టీ అధికారి సాత్విక్ వారి బృందం రెస్టారెంట్ లో తనిఖీ చేయగా పంటశాలలోపూర్తిగా శుభ్రం చేసి ఉంచారని పంటశాల ఇంకా పనినడుస్తుందని బిర్యానీ శాంపుల్స్ లేకుండా చేశారని రెస్టారెంట్లను పూర్తిగా తనిఖీ చేశామని తెలిసిన సమాచారము ప్రకారం రెస్టారెంట్ పై తగు చర్యలు తీసుకుంటామని అన్నారు





తుక్కాపూర్ వాగులో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట!

- **వాగు అంచున ట్రెంచ్.. ఇసుక తరలిస్తే కఠిన చర్యలు!**

కొల్చారం, అక్టోబర్ 14 (సిరి న్యూస్)

కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామ పరిధిలో వాగు నుంచి ప్రతిరోజూ ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు వాగులోకి వెళ్లి ఇసుక తీయకుండా వాగు అంచు నుండి ట్రెంచ్ వేయడం జరిగిందని మండల తహసిల్దార్ శ్రీనివాస్ చారి తెలిపారు. వాహనాల ద్వారా ఇసుకను తరలించకుండా ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఇకపై ఎవరైనా వాహనాల ద్వారా ఇసుకను తరలించినట్లు గుర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాగుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేపడితే ఉపేక్షించేది లేదని తాసిల్దార్ స్పష్టం చేశారు.



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రులు



సదాశివపేట. అక్టోబర్ 14. (సిరిన్యూస్)

సదాశివపేట లోని శ్రీ కన్యక పరమేశ్వరి మందిరంలో శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం నాడు శ్రీ చండిక పరమేశ్వరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్రనామములు, మధ్యాహ్నం హారతి, పాల్గొన్న భక్తులందరికీ మహా ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.



శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చెరు, అక్టోబర్ 14, (సిరి న్యూస్)

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం పటాన్ చేరు పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రకాష్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మాణిక్ ప్రభు, మల్లేష్, వినోద్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవిగా ముమ్మాదేవి అమ్మవారు

రాయికోడ్,అక్టోబర్14(సిరిన్యూస్):

రాయికోడ్ మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు ముమ్మాదేవి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ అర్చకులు శ్రీనివాస్ జ్యోషి పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆలయ పరిసరాలు



భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అనంతరం ఆలయం వద్ద భక్తులకు నిత్య అన్నదానం కొనసాగుతుంది .

వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం గుర్తింపు

వలిగొండ అక్టోబర్ 14

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని కేర్చిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో లభించిన వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పహిల్వాన్పురం గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య (70) ఈ నెల 2వ తేదీన తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.ఈ క్రమంలో అక్టోబర్ 14న ఉదయం సుమారు 10 గంటల సమయంలో కేర్చిపల్లి గ్రామ శివారులో బండారి జంగయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడికి వచ్చిన మృతుడి చిన్న కుమారుడు దుబ్బ భాస్కర్ మృతదేహాన్ని తన తండ్రి దుబ్బ పెంటయ్యగా గుర్తించారు.ఈ ఘటనపై పోలీసులు కేసును సెక్షన్ 194 BNSS కింద నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేవైఎం కొల్చారం మండల అధ్యక్షుడిగా అక్కెం ప్రవీణ్ యాదవ్



- **నూతన అధ్యక్షుడికి బిజెపి నాయకుల శుభాకాంక్షలు**

కొల్చారం, అక్టోబర్ 14(సిరి న్యూస్,)

భారతీయ జనతా యువమోర్చా కొల్చారం మండల అధ్యక్షుడిగా నియమితులైన అక్కెం ప్రవీణ్ యాదవ్ కు బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి కొల్చారం మండల అధ్యక్షుడు ఘనపూర్ పంతులు హరీష్ మాట్లాడుతూ.. అక్కెం ప్రవీణ్ యాదవ్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు కట్టుబడి ఉంటూ యువతను సంఘటితం చేసి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన నాయకత్వంలో కొల్చారం మండలంలో యువమోర్చా మరింత బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, బిజెపి మెదక్ జిల్లా ఓ బి సి మోర్చా కార్యదర్శి యాదగిరి, బిజెపి కొల్చారం మండల ప్రధాన కార్యదర్శి గుండు నాని, పల్లె రవికాంత్ నేత, బిజెపి మెదక్ జిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్, బీజేవైఎం నాయకుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- **చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి**

శేరిలింగంపల్లి,అక్టోబర్ 14(సిరి న్యూస్):



రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పూర్వపు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మాజీ కార్పొరేటర్, న్యాయవాది బొబ్బ నవత రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నమోదు ప్రక్రియలో చురుగ్గా పాల్గొని, అర్హులైన పట్టభద్రులందరూ 2026 నవంబర్ 6వ తేదీలోగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వాసవీ ఆలయంలో నవరాత్రి పూజలు



- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి..**
- **మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాలు**

రామచంద్రపురం, అక్టోబర్ 14 (సిరి న్యూస్):

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొంబాయి కాలనీలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజలో పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్ పాల్గొన్నారు.

భూభారతి–భూముల రీ సర్వేపై అవగాహన గ్రామసభ



- **అప్పాజీపల్లిలో రైతులకు అవగాహన కల్పించిన రెవెన్యూ అధికారులు**

కొల్చారం, అక్టోబర్ 14 (సిరి న్యూస్)

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి-భూముల రీ సర్వేపై అవగాహన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో భూభారతి, భూముల రీ సర్వేకు సంబంధించిన అంశాలపై రైతులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, కొల్చారం తహసీల్దార్ శ్రీనివాస చారి, డీఏఓ, మండల సర్వేయర్ మొగులయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్!

శేరిలింగంపల్లి,అక్టోబర్ 14(సిరి న్యూస్):



మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎండీఎంఏ మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 13న మధ్యాహ్నం సిద్ధి వినాయక నగర్‌లోని రాజ్ టవర్స్ సమీపంలో దాడులు నిర్వహించి కట్ట మాధవ్ అలియాస్ టోనీ (25), నామాల సిద్ధార్థ్ (25), ఎరుగు లోకేష్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఒక గ్రాము ఎండీఎంఏగా అనుమానిస్తున్న మాదక పదార్థం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మాధవ్ బెంగళూరులో గుర్తుతెలియని వ్యక్తి వద్ద రూ.6 వేలకు ఒక గ్రాము ఎండీఎంఏ కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి సిద్ధార్థ్‌కు రూ.10 వేలకు విక్రయించినట్లు వెల్లడైంది. సిద్ధార్థ్ ద్వారా లోకేష్‌తో పాటు మరికొందరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నంబర్ 1605/2026 నమోదు చేసి ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు, సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మాదాపూర్ సీఐ సుబ్బారావు కోరారు.

మాదాపూర్ 'ది జాయింట్ అల్ మండి' రెస్టారెంట్‌లో

మానవ దంతం కలకలం!

శేరిలింగంపల్లి,అక్టోబర్ 14(సిరి న్యూస్):



మాదాపూర్‌లోని 'ది జాయింట్ అల్ మండి' రెస్టారెంట్‌లో కస్టమర్‌కు వడ్డించిన ఆహారంలో పాడైపోయిన మానవ దంతం కనిపించడం కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో భోజనం చేసేందుకు హోటల్‌కు వెళ్లి ఆహారం తింటుండగా అందులో దంతం కనిపించింది. వెంటనే హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, తొలుత అది ఎముక ముక్క అని చెప్పే ప్రయత్నం చేశారని, పరిశీలించగా అది దంతంగా గుర్తించామని తెలిపారు. ఆహారం తిన్న అనంతరం వాంతులు కావడంతో అస్వస్థతకు గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. హోటల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, ప్రశ్నించేందుకు వెళ్లిన తనపట్ల దురుసుగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డారని రాగిరీ సాయిరాం గౌడ్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న హోటల్‌పై ఆహార భద్రత అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినియోగదారుడి ఫిర్యాదు మేరకు ఆహార భద్రత అధికారులు హోటల్‌లో తనిఖీలు నిర్వహించగా, అప్పటివరకు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను నిర్వాహకులు పారబోసినట్లు సమాచారం.


వైశాలి నగర్ రైల్వే అండర్‌పాస్ ప్రారంభం

- **ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ**

శేరిలింగంపల్లి,అక్టోబర్ 14(సిరి న్యూస్):



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీలో రైల్వే అండర్‌పాస్ వద్ద రూ.70 లక్షల వ్యయంతో చేపట్టిన వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడంతో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డీసీ సేవా ఇస్లావత్, ట్రాఫిక్ ఏసీపీ ఆదిమూర్తి, ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మంజీరా పైప్‌లైన్ రోడ్డు నుంచి మసీద్‌బండకు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని రూ.70 లక్షల తో వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామని, ఇకపై అండర్‌పాస్‌లో రెండు వాహనాలు సులభంగా రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులతో వైశాలి నగర్‌తో పాటు చుట్టుపక్కల కాలనీల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని గాంధీ అన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శిరీష, డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



మహా చండీ అవతారంలో అమ్మవారు

కొల్చారం అక్టోబర్ 13 చె (సిరి న్యూస్)


కొల్చారం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా దుర్గ భవాని శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా చండీ అలంకరణ మండల కేంద్రంలోని వీరభద్ర ఆలయ ప్రాంగణంలో కొలువైన దుర్గాభవాని అమ్మవారికి వేద పండితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో మహా చండి అవతారంలో అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో కొల్చారం గ్రామం ఉపసర్పంచ్ కోరంపల్లి రాణి గోపి దంపతులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు సమర్పించారు.భక్తులకు మహాప్రసాదం వితరణ చేశారు. అమ్మవారి కృపతో భక్తులందరూ అన్నివేళలా చల్లగా ఉండాలని, పాడిపంటలతో పాటు సకల అష్టైశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ భవాని ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జిరాక్స్ షాపులో షార్ట్ సర్క్యూట్

- **దాదాపు రూ.5 లక్షల ఆస్తినష్టం!**
- **కాలిపోయిన కంప్యూటర్లు, సీపీయూలు**
- **దెబ్బతిన్న జిరాక్స్ యంత్రాలు, ప్రింటర్లు**
- **జీవనోపాధి కోల్పోయాను : స్వాతి**

గుమ్మడిదల, అక్టోబర్ 14 (సిరి న్యూస్):





బతుకుదెరువు కోసం తనకున్న తెలివితేటలతో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని సంపాదించుకొని, జీవనోపాధి నిమిత్తం కంప్యూటర్, ఆన్‌లైన్ సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ మహిళ షార్ట్ సర్క్యూట్ కారణంగా తన జీవనాధారాన్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జిరాక్స్, ఆన్‌లైన్ సేవల కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్వాతి అనే మహిళ గుమ్మడిదల మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గత కొన్నేళ్లుగా జిరాక్స్, ఆన్‌లైన్ సేవల కేంద్రాన్ని నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం రాత్రి షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కంప్యూటర్లు, సీపీయూలు కాలిపోగా, జిరాక్స్ యంత్రాలు, ప్రింటర్లు, ఇతర విలువైన సామగ్రి దెబ్బతిన్నాయి. దీంతో సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

వర్షపు నీటితో వైరింగ్ సమస్యలు!

షాపు గోడల్లోకి వర్షపు నీరు ఇంకడం వల్ల విద్యుత్ వైరింగ్‌లో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కొత్త వైరింగ్ చేయించినప్పటికీ సమస్య పునరావృతమైందని పేర్కొంది. షాపులో జరిగిన అగ్నిప్రమాదంతో తన జీవనాధారం దెబ్బతిన్నదని వాపోయింది.

అధికారులు ఆదుకోవాలి

షాపుపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు ఈ ప్రమాదం తీవ్ర ఆర్థిక భారాన్ని మిగిల్చిందని బాధితురాలు స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి షాపు గోడలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, నష్టపోయిన తనకు తగిన సహాయం అందించి ఆదుకోవాలని ఆమె కోరింది.

కొల్చారంలో ఘనంగా దుర్గ భవాని నవరాత్రులు

- **మహా చండీ అవతారంలో అమ్మవారు**

కొల్చారం అక్టోబర్ 13 (సిరి న్యూస్).

కొల్చారం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దుర్గ భవాని శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా చండీ అలంకరణ మండల కేంద్రంలోని శివాలయంలో కొలువైన దుర్గాభవాని అమ్మవారికి వేద పండితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో మహా చండి అవతారంలో అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో రాము, లాస్య, శ్రవణ్, లహరి దంపతులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు సమర్పించారు. పూజల అనంతరం పాండ్ర వెంకటేశం శ్రీను కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు మహాప్రసాదం వితరణ చేశారు. అమ్మవారి కృపతో భక్తులందరూ అన్నివేళలా చల్లగా ఉండాలని, పాడిపంటలతో పాటు సకల అష్టైశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ భవాని ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దుర్తి అక్టోబర్ 14.(సిరి న్యూస్):

వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామంలో పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంను గ్రామ సర్పంచ్ నాగమణి విట్టల్ గౌడ్ పాక్స్ సీఈఓ తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల చేతుల్లో పోసి మోసపోవద్దని అన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను అందుకోవాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్ రెడ్డి, సిద్ధిరాములు, గ్రామ పెద్దలు ,రైతులు, పాల్గొన్నారు.

పల్లెల్లో క్రికెట్ జోష్..మైదానంలో సందడి..





- **భూదాఖుర్దులో క్రికెట్ కోలాహలం..**
- **కాశిరెడ్డిపల్లిలో కే.పి.ఎల్–3..**
- **బ్యాటింగ్‌తో ఉత్సాహం నింపిన నాతరి స్వామి..**
- **చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..మైదానమే యువతకు మార్గం..**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి
అక్టోబర్ 14 (సిరి న్యూస్)

గ్రామీణ క్రీడా ప్రతిభకు కేరాఫ్ అడ్రస్ ఈ యువ క్రీడాకారులు! పల్లె మట్టిలో పుట్టి, పట్టుదలే పెట్టుబడిగా, చెమటే ఆయుధంగా మైదానంలోకి దిగిన ఈ యువ ఆటగాళ్లు గ్రామానికే గర్వకారణంగా నిలుస్తున్నారు. ఉదయాన్నే మైదానానికి చేరి, కఠోర సాధన చేస్తూ, తమ ఆటతో అందరినీ అబ్బురపరుస్తున్న ఈ యువ క్రికెటర్లే రేపటి గ్రామీణ క్రీడా భవిష్యత్తు. వీరి ఉత్సాహం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం.

బెల్లంపల్లి నియోజకవర్గం, బెల్లంపల్లి మండలం భూదాఖుర్దు గ్రామపంచాయతీ పరిధిలోని కాశిరెడ్డిపల్లిలో కే.పి.ఎల్ సీజన్-3 క్రికెట్ పోటీల ప్రారంభం ఘనంగా ప్రారంభమయ్యాయి. యువ క్రీడాకారుల కేరింతలతో, ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మైదానం మార్మోగింది. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పిలుపు..

గ్రామపంచాయతీ పరిధిలో క్రికెట్ సందడి మొదలైంది..

బెల్లంపల్లి నియోజకవర్గం, బెల్లంపల్లి మండలం భూదాఖుర్దు గ్రామపంచాయతీ పరిధిలో క్రికెట్ సందడి మొదలైంది. కే.పి.ఎల్ (కాశిరెడ్డిపల్లి ప్రీమియర్ లీగ్) సీజన్-3 క్రికెట్ పోటీలు బుధవారం కాశిరెడ్డిపల్లి మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. యువ క్రీడాకారుల కేరింతలతో, ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మైదానం మార్మోగింది. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు..

టాస్ వేసిన సర్పంచ్...
బ్యాట్ పట్టిన నాతరి స్వామి..

పోటీల ఆరంభానికి ముందు యువ క్రికెట్ జట్ల సభ్యులను అతిథులకు పరిచయం చేశారు. అనంతరం సర్పంచ్ టాస్ వేయగా, నాతరి స్వామి స్వయంగా బ్యాట్ పట్టి మైదానంలోకి దిగి క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఆయన తమతో కలిసి ఆడటంతో యువ ఆటగాళ్లలో ఉత్సాహం రెట్టింపైంది. మైదానం మొత్తం చప్పట్లు, ఈలలతో హోరెత్తింది..

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి..

ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని గట్టిగా పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే యువత భవిష్యత్తు బంగారుమయమవుతుందని, గ్రామాలకు మంచి పేరు వస్తుందని అన్నారు..

మొబైల్ ఫోన్లకు అతుక్కుపోవద్దు...
మైదానానికి రండి..

యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, చదువు, క్రీడలపై పూర్తిగా దృష్టి సారించాలని ఆయన సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను అందిస్తాయని, ఒత్తిడిని తగ్గిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు..

మైదానంలోకి నేతల హాజరు..

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, సీనియర్ నాయకులు ఎంబడి సురేష్, బండి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, క్రీడాభిమానులు హాజరై యువ ఆటగాళ్లను ప్రోత్సహించారు.

రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

- **ఎంపీ రఘునందన్ రావు చొరవతో డెంటల్ సేవలు.**
- **గైనకాలజిస్ట్ నియామకం**
- **మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, బిజెపి నాయకులు పబ్బ సత్యనారాయణ గుప్తా.**

రామాయంపేట, అక్టోబర్ 14 (సిరి న్యూస్)

నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషి చేస్తున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్, పార్టీ నాయకులు పబ్బ సత్యనారాయణ గుప్తా, దామోదర్ రావు తదితరులు మాట్లాడారు. రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించి ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నా గైనకాలజిస్ట్, డెంటల్ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను గుర్తించిన ఎంపీ రఘునందన్ రావు మూడు నెలల క్రితం ఆసుపత్రిని సందర్శించి, అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారని తెలిపారు. వెంటనే తన ఎంపీ నిధుల ద్వారా డెంటల్ చైర్‌ను అందించి, ప్రజలకు దంత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు. అదేవిధంగా పది రోజుల క్రితం మరోసారి ఆసుపత్రిని సందర్శించిన ఎంపీ, గైనకాలజిస్ట్ లేకపోవడంతో మహిళలు, గర్భిణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కేవలం వారం రోజుల వ్యవధిలోనే గైనకాలజిస్ట్ వైద్యురాలిని నియమించేలా కృషి చేశారని వెల్లడించారు. ఎంపీ రఘునందన్ రావు చొరవతో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్, ప్రసూతి వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.



కరెంట్ కాల్చింది.. కంజర్ల ఫౌండేషన్ ఆదుకుంది

- **బాధిత కుటుంబానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగాఉంటుంది-**
- **జిల్లా మాజీ కో అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ**

యాలాల మండలం, అక్టోబర్,14

యాలాల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెను ప్రమాదం చోటుచేసుకుంది. కుమ్మరి బుచ్చమ్మకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు కష్టపడి దాచుకున్న నగదు కూడా కాలిపోయింది. దీంతో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. ఒక్కసారిగా ఇల్లు కాలిపోవడంతో బుచ్చమ్మ కుటుంబం రోడ్డున పడింది.విషయం తెలుసుకున్న కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మానవతా దృక్పథంతో నిత్యావసర వస్తువులను అందజేసి అండగా నిలిచారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాజీ జిల్లా కో ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ, మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో అవసరమైన సహాయం అందిస్తామని" హామీ ఇచ్చారు.

లైన్‌మెన్ నిర్లక్ష్యానికి యువ రైతు బలి

- **ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రైతును ఎక్కించి.. కిందనే ఉన్న అసిస్టెంట్ లైన్‌మెన్**

మెదక్, అక్టోబర్ 14 సిరి న్యూస్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిదే అయినప్పటికీ, రైతుతో ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు చేయించిన ఘటనలో ఓ యువ రైతు ప్రాణాలు కోల్పోయాడు. టేక్మాల్ మండలం దండువానికుంట తండాకు చెందిన విస్లావత్ అనిల్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ ప్రవహించి మృతి చెందాడు. ఈ ఘటనలో క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ ట్రాన్స్‌ఫార్మర్ కిందనే ఉన్నప్పటికీ, రైతు పైకి ఎక్కి పని చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులను అర్హత కలిగిన విద్యుత్ సిబ్బందే తగిన భద్రతా చర్యలతో నిర్వహించాలి. అలాంటప్పుడు సిబ్బంది అక్కడే ఉండగా రైతుతో ప్రమాదకరమైన విద్యుత్ పని ఎందుకు చేయించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ పనుల్లో సరఫరా నిలిపివేయడం, భద్రతా నిబంధనలు పాటించడం అత్యంత కీలకం. అసిస్టెంట్ లైన్‌మెన్ సమక్షంలోనే రైతు ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ ప్రవహించి మృతి చెందడం సిబ్బంది విధుల నిర్వహణపై విమర్శలకు



తావిస్తోంది. రైతుతో పని చేయించిన పరిస్థితులు, విద్యుత్ సరఫరా నిలిపివేత, భద్రతా చర్యల అమలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. విధుల్లో నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యుత్ సిబ్బందే నిర్వహించాల్సిన పనిలో రైతు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

హనుమంత వాహన సేవ పై శ్రీనివాసుడి ఊరేగింపు



- **మంగళహారతులతో స్వామివారికి మహిళల స్వాగతం**

గుమ్మడిదల, అక్టోబర్ 14 (సిరి న్యూస్)

బ్రహ్మోత్సవాల వైభవాన్ని తలపించేలా గుమ్మడిదలలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారు హనుమంత వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి ప్రారంభమైన స్వామివారి వాహన సేవ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వైభవంగా సాగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా, వీధులన్నీ భక్తి వాతావరణంతో సందడిగా మారాయి. వాహన సేవ సందర్భంగా మహిళలు ఇళ్ల ఎదుట మంగళహారతులు పట్టి స్వామివారికి భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమలు అందించుకుంటూ సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. స్వామివారి ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గుమ్మడిదల పురపాలక సంఘం కేంద్రంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాలను ఈసారి కూడా ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వాహన సేవలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి పోచుగారి రవీందర్‌రెడ్డి, సత్య నారాయణ, కాళ్లకంటి రవీందర్‌రెడ్డి, నర్సింలు, మద్దెటి బాలరాజ్, బాల్‌రెడ్డి, పడమటి చంద్రారెడ్డి, పోచుగారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత శక్తితో మహిళల ఆర్థిక ప్రగతి!

- **మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**
- **తొగర్రాయిలో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన**
- **రూ.10 లక్షలతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

దుగ్గొండి/వరంగల్, అక్టోబర్ 14

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి ద్వారా కోటీశ్వరులుగా ఎదిగేలా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, స్వయంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకునే స్థాయికి చేరాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మహిళా సంఘం భవనం అందుబాటులోకి వస్తే సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థంగా కొనసాగించేందుకు వీలవుతుందన్నారుగ్రామాల అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా (ఐపీఎస్)అధ్యక్షతన

- **జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం**

వికారాబాద్,అక్టోబర్,14

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS అధ్యక్షతన బుధవారం పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రోడ్డు భద్రత, మహిళలు మరియు పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.CCTNS 3.0, Samanvay, Sahyog మరియు TGCOP వంటి అప్లికేషన్లను క్షేత్రస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాపర్టీ, సైబర్, ఎన్‌డీపీఎస్ కేసులతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లు (NBW), డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (FSL) నివేదికలను సకాలంలో పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.మహిళలు మరియు పిల్లల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ మరియు మిస్సింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. నిందితుల అరెస్టుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మైనర్ల డ్రైవింగ్‌పై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో సీసీటీవీ కెమెరాల కవరేజీని పెంచడంతో పాటు ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్, వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణకు నిరంతర నిఘా కొనసాగించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.“ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యం. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా, సమన్వయంతో విధులు నిర్వర్తించాలి. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి. ప్రజల భద్రతకు కట్టుబడి ప్రతి ఒక్కరూ నిరంతరం పనిచేయాలి,” అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ ఎన్. యాదయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, పరిగి డీస్పీ ఎన్.శ్రీనివాసు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- **శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

నారాయణపేట,అక్టోబర్,14

భూముల రీ సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, జిల్లాలో పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, భూ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు (డీటీలు), రెవెన్యూ ఇన్స్పెక్టర్లు (ఆర్ఐలు), గ్రామ పంచాయతీ అధికారులు (జీపీవోలు), సర్వేయర్లకు భూముల రీ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రియాంక, భూముల రీ సర్వే నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, సర్వే ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంబంధిత రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.భూముల రీ సర్వే అనేది భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా గుర్తించి, భూ రికార్డులను క్రమబద్ధీకరించడంలో కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నిర్వహించే సమయంలో భూముల సరిహద్దులు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.శిక్షణా కార్యక్రమంలో వివరించిన సాంకేతిక అంశాలు, విధివిధానాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో వాటిని ఆచరణలో పెట్టాలని కలెక్టర్ సూచించారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, తగిన మార్గదర్శకత్వంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో సమన్వయంతో పనిచేస్తూ, తమకు కేటాయించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు.రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తే రీ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణను కేవలం అవగాహన కార్యక్రమంగా మాత్రమే పరిమితం చేయకుండా, అందులో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, భూ సర్వేలో కచ్చితత్వం, పారదర్శకతను పాటించాలని ఆమె స్పష్టం చేశారు. భూముల రీ సర్వేకు సంబంధించిన ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, సర్వే ల్యాండ్ ఏ.డీ. వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పులిమామిడి రాజు మమత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం





సదాశివపేట. అక్టోబర్ 14. (సిరిన్యూస్)

దేవి నవరాత్రుల సందర్భంగా సదాశివపేట పట్టణంలోని చాపలకేరి శ్రీ మహంకాళి మందిరంలో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ మహంకాళి మాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, మమత రాజు దంపతులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు రాకేష్ పంతులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ దేశంలో ఏలినో ప్రభావం వలన వర్షాలు పడడం లేదని, నీళ్లులేక పాడి పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు రోజు రోజుకు తగ్గిపోతుందని, అమ్మ మా దేశ ప్రజలను సుభిక్షంగా ఉంచమ్మ, వర్షాలు కురిపించమ్మా, ప్రజలను చల్లగా చూడమ్మా, కరువునుండి కాపాడమ్మా అని పులిమామిడి రాజు అమ్మవారిని వేడుకున్నారు. ఇంత భక్తితో కొలిచే నిన్ను నిమజ్జనం చేయాలంటే చెరువుల్లో నీళ్లు లేవమ్మా, కరుణించమ్మ కాపాడమ్మా, నీ యొక్క నిమజ్జనంలోపు వర్షాన్ని కురిపించి నువ్వు ఉన్నావని నిరూపించుకొమ్మని ఆ మహంకాళి మాతను, అన్న పూర్ణ మాతను సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు వేడుకున్నారు. సదాశివపేట అంటేనే ఎల్లప్పుడు ఆ సదాశివుడు నివసించే ప్రాతం అని పులిమామిడి రాజు అన్నారు. ఇక్కడ ఉన్నన్ని దేవాలయాలు ఏ గ్రామంలో లేవని అన్నారు. అనంతరం పులిమామిడి మమత రాజు దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి నిర్వహించిన భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపి ప్రియాంక పవన్ శ్రీ మహంకాళి దేవాలయ అధ్యక్షులు నల్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నల్ల శంకర్, కార్యవర్గ సభ్యులు చాపల హన్మంతు, జనార్ధన్, బంటు రవి, పద్మ మాణిక్యం, సాతాని నరేందర్, మహేష్, అఖిల్, నాగరాజు, రాగం అనిల్, తాలెల్మ రాము, సోమ శంకర్ తదితరులతో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పటేల్ చెరువు కట్టుకాలువపై పరిశ్రమ ఆక్రమణ!

- **పార్కింగ్‌గా వినియోగం.. చెరువులోకి నీరు చేరకుండా అడ్డంకులు**
- **అదనపు కలెక్టర్‌కు మంబాపూర్ గ్రామస్తుల ఫిర్యాదు**

గుమ్మడిదల, అక్టోబరు 14 (సిరి న్యూస్):



మంబాపూర్ గ్రామ రైతులకు జీవనాధారంగా ఉన్న పటేల్ చెరువుకు నీరు చేరేందుకు కీలకమైన కట్టుకాలువను భారీ పరిశ్రమ ఆక్రమించి, దానిపై వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసిందని గ్రామానికి చెందిన నీరుడి శ్రీనివాస్, రాచమల్ల రాజు గౌడ్, గొట్టిముక్కుల రాజు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. మంబాపూర్ గ్రామానికి చెందిన రైతులు పటేల్ చెరువు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని ఫిర్యాదుదారులు తెలిపారు. అయితే చెరువుకు నీరు చేరే కట్టుకాలువను భారీ పరిశ్రమ ఆక్రమించి, కాలువపై నిర్మాణాలు చేపట్టి వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తోందని ఆరోపించారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి, చెరువులోకి నీరు సక్రమంగా చేరకుండా అడ్డంకులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టుకాలువపై నిర్మాణాలు చేపట్టి పార్కింగ్‌కు వినియోగించడం వల్ల చెరువుకు నీరు చేరే మార్గం దెబ్బతింటోందని, ఇది రైతుల సాగునీటి అవసరాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి కట్టుకాలువపై చేపట్టిన నిర్మాణాలపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కాలువను పునరుద్ధరించి, వర్షపు నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా పటేల్ చెరువులోకి చేరేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ రైతుల జీవనాధారమైన చెరువును పరిరక్షించి, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

ఇన్స్పెక్టర్ కనుసన్నల్లో...!





- **ఇరగదీసిన పోలీసులు...?**
- **క్రిటికల్ కేర్ లో అవస్థలు....**

రాజన్న సిరిసిల్ల జిల్లా... రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న పోలీసులకు అడ్డాగా మారిందా అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి... నాటి నేరెళ్ళ ఘటన ఇప్పటికీ పచ్చి పుండులాగే ఉండగా, మళ్ళీ మరో ఘటన వెలుగులోకి రావడం సంచలనాత్మకంగా మారింది... దాదాపు రెండు గంటలు బట్టలూడదీసి కొట్టినట్టు బాధితులు చెపుతున్న మాటలు వింటుంటే మానవత్వం ఉన్న మనుషులు ఎవరైనా కదిలిపోవాల్సిందే... అయితే కరుకు ఖాకీ బూట్ల కాఠిన్యం కింద నలుగుతున్న మానవత్వం మరోసారి మంటగలిసిందనే సంఘటన గంభీరావు పేట పోలీస్ స్టేషన్ ఘటనతో నిరూపితం అయినట్టేనని తెలుస్తుంది... నాడు దేశ ప్రజలను హీనంగా చూస్తూ చీకటి జైళ్లలో, బూట్లు నాకించుకునేవారని చరిత్రలో చదువుకున్నాం.. అయితే ప్రస్తుతం కూడా అదే బ్రిటీష్ కాలం చట్టాలను అమలు చేస్తూ బాధితుల మాటల్లో చూసుకుంటే ప్రశ్నించే వారిని, దోషులుగా చిత్రీకరిస్తూ లాఠీలతో చేసిన వీరంగం విస్తుగొలిపెలా ఉందనుకోవచ్చు. అయితే సదరు బ్రిటిష్ చట్టాలు కాలంలో కలిసి, ప్రస్తుతం భారత న్యాయ సంహిత అందుబాటులోకి వచ్చినా సరే తమకు బ్రిటిష్ చట్టాలే ముద్దనే పోలీసులు ఉన్నంత కాలం ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయనే ఉదంతం మరోసారి గంభీరావు పేట ఘటనతో నిరూపిత మవుతుందని తెలుస్తుంది.

ఇరగదీసిన పోలీసులు

సోమవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో సంపత్ అనే వ్యక్తిని, తరువాత గంటలో శేఖర్ అనే వ్యక్తిని గంభీరావు పేట పోలీసులు కరీంనగర్ లో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. బాధితులు వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్ పట్టణం దాటగానే మొదలైన పోలీసు ప్రత్యేక విచారణ, స్టేషన్ లోపలికి చేరుకోగానే తారాస్థాయికి చేరుకున్నట్టు తెలుస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు సాగిన ఆ ప్రత్యేక పోలీసు విచారణ పగ వాళ్ళకు రాకూడదంటూ బాధితులు చెపుతున్న విషయం చూపరులను కంటతడి పెట్టిస్తుంది. ఎస్సై తో పాటు దాదాపు 5 నుండి 6 మంది కానిస్టేబుళ్ళు చేసిన ప్రత్యేక విచారణ గతంలో జరిగిన నేరెళ్ళ ఘటనకు ఏమాత్రం తీసిపోదేమో. చేసేది ఘనకార్యం అన్నట్టు ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు సదరు ఎస్సై సామాజిక మాధ్యమం ద్వారా వీడియో కాల్ చేసి మరీ చూపించినట్టు బాధితులు వెల్లడించారు. అందులో ఒకరు పోలీసు ఉన్నతాధికారి, మరొకరు ఆ ఎస్సై బంధువు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంతా చేసి తమనెవరూ ఏం చెయ్యలేరనే అత్యుత్సాహంతో రిమాండ్ కు పంపించేందుకు ప్రయత్నం చేయగా, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం గమనార్హం.



క్రిటికల్ కేర్ లో అవస్థలు....

పోలీసు అధికారుల ప్రత్యేక విచారణ లో ఉన్న బాధితుల్లో ఒకరైన శేఖర్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా, సంపత్ వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వారిరువురు ప్రస్తుతం నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కనీసం సరిగా పడుకోలేక, కూర్చోలేక వారు పడుతున్న అవస్థలు చూస్తూ కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు ఆసుపత్రికి వచ్చిన ప్రతీ ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. దాదాపు రెండు నుండి మూడు గంటల పాటు తమపై పోలీసులు చేసిన దాష్టీకం తలుచుకుంటేనే వణుకు పుడుతుందని బాధితులు గోళ్ళుమంటున్నారు. ఉద్యోగంలో ఉన్న నా పైనే వార్తలు రాస్తావా అంటూ చెప్పలేని భాషలో బూతుల తిడుతూ వివరీతంగా కొట్టారని తెలిపారు. ఐసియులో ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితులు యువకులు కావడం, పోలీసు దెబ్బలు భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా గంభీరావు పేట పోలీసులు సాగిన దాష్టీకంలో కేవలం ఆ స్టేషన్ ఎస్సై తో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్, డీఎస్పీ, ఎస్పీలు కూడా భాగస్వాములే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు అయిదు సార్లు డిఎస్ఆర్ చెప్పే పోలీసులు, మాకు తెలియదు అంటే మాకు తెలియదు అంటూ ఉన్నత స్థాయి అధికారులు తప్పించుకుంటూ, కేవలం ఎస్సై పైనే నెపం నెట్టేలా పావులు కదపడం గమనార్హం. ఒక దళిత సామాజిక వర్గం వ్యక్తిని తమ బూట్లు నాకించడం పోలీసు పైశాచికత్వానికి పరాకాష్ట కాగా, తప్పించుకునే క్రమంలో మళ్ళీ మీడియా వ్యక్తులనే మధ్యవర్తిత్వానికి పిలుస్తుండడం కొసమెరుపు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

గురువారం
అక్టోబర్-15-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 285

పేజీలు : 5

పన్ను వసూళ్లపై సైబరాబాద్ కమిషనర్ సీరియస్

- నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ తప్పదంటూ హెచ్చరిక "
- 'సిరి న్యూస్' కథనంతో కదిలిన అధికార యంత్రం
- డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ అధ్వర్యంలో అత్యవసర సమావేశం
- నిర్దేశిత టార్గెట్ వంద శాతం రీచ్ కావాల్సిందేనని ఆదేశం
- బాధ్యత వహించని సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిక

క్షేత్రస్థాయిలో వేగవంతమైన వసూళ్లకు రంగం సిద్ధం






రంగుల రుచి..కానరాని శుచి !

- రోగాలకు నిలయాలుగా దాబాలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
- నాణ్యత డొల్లతో ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోనే అధికారులెవరు?
- అపరిశుభ్ర వాతావరణంలో ఆహార తయారీపై ఆందోళన
- నాసిరకం పదార్థాలు, నిల్వ మాంసం వినియోగంపై ఆరోపణలు
- గుమ్మడిదల, బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి..
- నర్సాపూర్ ప్రాంతంలో ఫుడ్ పాయిజన్ తో పలువురికి అస్వస్థత

4

రుచికరమైన ఆహారం కోసం బయటకు వెళ్తున్న ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందుతోందా? అన్న ప్రశ్న ఇప్పుడు గుమ్మడిదల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. నర్సాపూర్ పట్టణ ప్రాంతంలో ఒక హోటల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా పలువురు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఇదేవిధంగా గుమ్మడిదల పారిశ్రామిక వాడ ప్రాంతంలో దాబాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఓటర్లలో కొనసాగుతున్న తీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవబడిన చెప్పవచ్చు. సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి దాబాలకు, హోటళ్లకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు వెళ్లి ఆహారం తీసుకునే వారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆయా కేంద్రాల్లో ఆహార పదార్థాల నాణ్యత, వంటగదుల పరిశుభ్రత, మాంసం నిల్వ, వంట నూనె వినియోగంపై తగిన పర్యవేక్షణ ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధితో గుమ్మడిదల తో పాటు బొంతపల్లి, అన్నారం పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న దాబాలతో పాటు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మిర్చి బండ్లు, పానీ పూరి ఇతర చిరుతిళ్ల దుకాణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ఇందిర)
గుమ్మడిదల, (సిరి న్యూస్):



3

సమాచార హక్కు చట్టం
ఏదీ జవాబుదారీతనం!

పారదర్శకతకు తూట్లు.. కాగితాలకే పరిమితమైన చట్టం

- సమాచారం అడిగితే అధికారుల దాటవేత
- కార్యాలయాల చుట్టూ తిప్పుతూ వేధింపులు
- మెదక్ జిల్లాలో ఆర్టీఐ అమలుపై నీలినీడలు
- 30 రోజుల గడువు ముగిసినా అందని సమాధానాలు
- అసంపూర్ణ సమాచారం, తప్పుడు వివరాలతో దరఖాస్తుదారులకు బురిడీ
- సెక్షన్ 20 ప్రకారం బాధ్యులైన పీఐవోలపై రూ. 25వేల జరిమానా విధించాలి
- దరఖాస్తుదారులను వేధించడం ఆపాలని ఆర్టీఐ సంఘాల హెచ్చరిక

'స్మార్ట్'గా బాల్యం బందీ!

స్మార్ట్‌ఫోన్ల వ్యసనంలో చిక్కుకుపోతున్నచిన్నారుల



ఆటపాటల స్థానంలో స్క్రీన్ కు బానిసత్వం

రీల్స్ మాయలో కరిగిపోతున్న సృజనాత్మకత

- రేపటి తరం మానసిక సంక్షోభంలో పడకముందే మేల్కొనాలి
- అంతులేని రీల్స్ స్క్రోలింగ్‌తో క్షీణిస్తున్న ఏకాగ్రత, సహనం
- షాకింగ్ కంటెంట్, అసహజ ప్రవర్తనలకే అలవాటుపడుతున్న మెదడు
- సామాజిక మాధ్యమాల మాయతో పెరుగుతున్న ఒంటరితనం
- నిశ్శబ్ద గురువులా పిల్లల ఆలోచనలను శాసిస్తున్న అల్గారిథమ్స్
- ప్రేమతో కూడిన నిరంతర పర్యవేక్షణే శ్రీరామరక్ష
- పాఠశాలల్లో డిజిటల్ అక్షరాస్యత, భావోద్వేగ విద్య తప్పనిసరి



5

పన్ను వసూళ్లపై సైబరాబాద్ కమిషనర్ సీరియస్

- నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ తప్పదంటూ హెచ్చరిక "
- 'సిరి న్యూస్' కథనంతో కదిలిన అధికార యంత్రం
- డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ అధ్వర్యంలో అత్యవ సర సమావేశం
- నిర్దేశిత టార్గెట్ వంద శాతం రీచ్ కావా ల్సిందేనని ఆదేశం
- బాధ్యత వహించని సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిక
- క్షేత్రస్థాయిలో వేగ వంతమైన వసూళ్లకు రంగం సిద్ధం





అమీన్పూర్, అక్టోబర్ 14 (సిరి న్యూస్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల అంశంపై కమిషనర్ సీరియస్ అయిన నేపథ్యంలో.. అధికార యంత్రంలో వేగంగా కదలిక వచ్చింది. సైబరాబాద్ సీఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో సర్కిల్-47 కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఏఎంసీలు, బిల్ కలెక్టర్లతో ఒక అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో పన్ను వసూళ్లలో నెలకొన్న అలసత్వంపై 'సిరి న్యూస్' ప్రచురించిన కథనంతో అప్రమత్తమైన అధికార యంత్రం.. తక్షణమే రంగంలోకి దిగి సమీక్షలు ప్రారంభించడం గమనార్హం. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ అధికారులతో క్షేత్రస్థాయి పరిస్థితిపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఆస్తి పన్ను వసూలు చేయడంలో ఎలాంటి ఉపేక్ష వహించవద్దని ఆయన స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే ఏ స్థాయి సిబ్బందిపైనైనా ఉపేక్షించేది లేదని, సస్పెన్షన్ చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ప్రతి బిల్ కలెక్టర్ తమకు కేటాయించిన డివిజన్ పరిధిలో వందశాతం పన్ను వసూళ్లు సాధించాలని స్పష్టం చేశారు.పరిశ్రమలపై ప్రత్యేక నిఘా అమీన్పూర్ పరిధిలోని బొల్లారం ప్రాంతంలో ఉన్న బకాయిదారులపై, ముఖ్యంగా భారీగా పన్నులు చెల్లించాల్సిన పరిశ్రమలు, వ్యాపార, నివాస సముదాయాల యాజమాన్యాలపై నిత్యం ఫోకస్ పెట్టాలని డీసీ ఆదేశించారు. బకాయి ఉన్న సంస్థలకు తక్షణమే నోటీసులు అందజేసి, వసూళ్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పన్ను పెంపు మరియు వసూళ్ల విషయంలో ఏఎంసీలు మరింత చురుకుగా పనిచేసి ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణం.. కమనీయం

శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

- గోవింద నామస్మరణల మధ్య
- వైభవంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కళ్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు





గుమ్మడిదల, అక్టోబర్ 14 (సిరి న్యూస్): గోవింద నామస్మరణలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య గుమ్మడిదలలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలో కొలువుదీరిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కళ్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి కళ్యాణాన్ని కనులారా వీక్షించి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు నరసింహాచార్యులు, రంగనాథాచార్యుల నేతృత్వంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ స్వామివారి కళ్యాణ ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణలతో మార్మోగాయి. స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకునేందుకు గుమ్మడిదలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భజనలు, గోవింద నామస్మరణలతో స్వామివారిని కీర్తించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించారు.ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు నిర్వహించే శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో కళ్యాణోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.



ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించడం, అవినీతిని అరికట్టి అధికారులలో ప్రజలకు జవాబుదారీతనం పెంచే లక్ష్యంతో అమల్లోకి వచ్చిన చారిత్రక సమాచార హక్కు చట్టం2005 మెదక్ జిల్లాలో తీవ్ర నిరాదరణకు గురవుతోంది. ప్రజాధనం ఏ విధంగా ఖర్చవుతోంది? సంక్షేమ పథకాలు ఎలా అమలవుతున్నాయి? కాంట్రాక్టర్లకు బిల్లులు ఏ ప్రాతిపదికన చెల్లిస్తున్నారు? అనే కీలక వివరాలను తెలుసుకునే రాజ్యాంగబద్ధమైన హక్కును ఈ చట్టం సామాన్య పౌరుడికి కల్పించింది. అయితే మెదక్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్న పౌరులకు నిర్ణీత గడువులో సరైన సమాచారం ఇవ్వకపోవడం, అడిగిన ప్రశ్నలను దాటవేయడం, దరఖాస్తులను కార్యాలయాల మధ్య అనవసరంగా బదిలీ చేస్తూ కాలయాపన చేస్తుండటం వల్ల చట్టం ఉద్దేశమే నీరుగారిపోతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

మెదక్, సిరి న్యూస్



సమాచార హక్కు చట్టం
ఏది జవాబుదారీతనం!



- సమాచారం అడిగితే అధికారుల దాటవేత
- కార్యాలయాల చుట్టూ తిప్పుతూ వేధింపులు
- మెదక్ జిల్లాలో ఆర్టీఐ అమలుపై నీలినీడలు
- 30 రోజుల గడువు ముగిసినా అందని సమాధానాలు
- అసంపూర్ణ సమాచారం, తప్పుడు వివరాలతో దరఖాస్తుదారులకు బురిడీ
- ప్రజాధనం ఖర్చు వివరాలు అడిగితే అధికారుల్లో మొదలవుతున్న గుబులు
- అప్పీళ్లకు వెళ్లలేక నిరుత్సాహానికి గురవుతున్న సామాన్య పౌరులు
- సెక్షన్ 20 ప్రకారం బాధ్యులైన పీఐవోలపై రూ. 25వేల జరిమానా విధించాలి
- దరఖాస్తుదారులను వేధించడం ఆపాలని ఆర్టీఐ సంఘాల హెచ్చరిక

పారదర్శకతకు తూట్లు.. కాగితాలకే పరిమితమైన చట్టం

కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి

మెదక్ జిల్లాలోని ప్రజా సమాచార అధికారులు చట్టానికి లోబడి పనిచేసేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతినెలా ప్రజావాణి తరహాలోనే ఆర్టీఐ పెండింగ్ దరఖాస్తులపై మండల, డివిజన్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి. ఉద్దేశపూర్వకంగా సమాచారాన్ని నిరాకరించే, తప్పుడు పత్రాలు ఇచ్చే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి బాధ్యులను చేయాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచారం పొందడం ప్రజల హక్కు అని, ప్రభుత్వ పనుల్లో పారదర్శకత కల్పించడం అధికారుల బాధ్యత అని గుర్తించి చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా పౌర సమాజం డిమాండ్ చేస్తోంది.

గడువు దాటినా సమాధానం శూన్యం

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 7(1) నిబంధనల ప్రకారం దరఖాస్తు అందిన 30 రోజుల్లోగా సంబంధిత ప్రజా సమాచార అధికారి (పీఐవో) పూర్తిస్థాయి సమాచారాన్ని దరఖాస్తుదారునికి లిఖిత పూర్వకంగా అందించాలి. ఒకవేళ అది వ్యక్తి జీవించే హక్కు లేదా స్వేచ్ఛకు సంబంధించినదైతే 48 గంటల్లోనే సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ సమాచారం వేరే విభాగానికి చెందినదైతే సెక్షన్ 6(3) ప్రకారం కేవలం ఐదు రోజుల్లోనే సంబంధిత కార్యాలయానికి బదిలీ చేయాలి. కానీ జిల్లాలోని పంచాయతీ, రెవెన్యూ, మున్సిపల్, విద్యా శాఖల అధికారులు ఈ చట్టబద్ధమైన గడువులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నెలలు గడుస్తున్నా సమాధానం ఇవ్వకపోగా, ప్రశ్నించిన దరఖాస్తుదారులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేసే ధోరణి పెరుగుతోంది.

ఖర్చుల లెక్కలు అడిగితే అధికారుల్లో దడ

గ్రామ పంచాయతీల నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల వినియోగంపై సమాచారం కోరితే అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రహదారుల నిర్మాణం, డైనేజీ పనుల నాణ్యత తనిఖీ నివేదికలు, కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లుల ఎంబీ రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక జాబితాలు బయటకు వస్తే తమ అక్రమాలు ఎక్కడ బట్టబయలవుతాయోనన్న భయంతో అధికారులు ఫైళ్లను తొక్కిపెడుతున్నారు. పాత రికార్డులు లేవని, కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని కుంటిసాకులు చెబుతూ ప్రజాస్వామ్యం కల్పించిన సమాచార హక్కును అపహాస్యం చేస్తున్నారు.

అప్పీళ్ల ప్రక్రియలో సామాన్యుడికి తప్పని ప్రయాస

నిర్ణీత 30 రోజుల్లో సమాచారం రాకపోతే సెక్షన్ 19 ప్రకారం మొదటి అప్పీలేట్ అధికారిని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే హైదరాబాద్‌లోని రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించే వెసులుబాటు ఉంది. అయితే గ్రామీణ ప్రాంతాల దరఖాస్తుదారులకు అప్పీల్ ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడం, హైదరాబాద్‌కు తిరిగే ఆర్థిక స్తోమత లేకపోవడాన్ని కొందరు అవినీతి అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పనులను మానుకుని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగలేక ఎంతోమంది సామాన్యులు మధ్యలోనే దరఖాస్తులను వదిలేసి నిరాశకు గురవుతున్నారు. అధికారుల ఈ దాటవేత ధోరణి వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.



సెక్షన్ 20 ప్రకారం కఠిన జరిమానాలు విధించాలి: అంజిగౌడ్

సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయాలని మెదక్ జిల్లా ఆర్టీఐ చట్టం అధ్యక్షుడు అక్కంగారి అంజిగౌడ్ డిమాండ్ చేశారు. దరఖాస్తులను నిర్లక్ష్యం చేసే అధికారులపై సెక్షన్ 20 ప్రకారం రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.25వేల వరకు జరిమానా విధించడంతో పాటు, వారిపై సర్వీస్ నిబంధనల ప్రకారం శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు సిఫారసు చేయాలని కమిషన్‌ను కోరారు. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం స్వచ్ఛందంగా తమ ఆదాయ వ్యయాలు, విధులు, పథకాల వివరాలను నోటీసు బోర్డులు, వెబ్‌సైట్లలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని, దరఖాస్తు స్వీకరణకు పక్కాగా రసీదు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.



రుచికరమైన ఆహారం కోసం బయటకు వెళ్తున్న ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందుతోందా? అన్న ప్రశ్న ఇప్పుడు గుమ్మడిదల పరిసర ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారుతోంది. నర్సాపూర్ పట్టణ ప్రాంతంలో ఒక హోటల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇదేవిధంగా గుమ్మడిదల పారిశ్రామికవాడ ప్రాంతంలో దాబాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఓటర్లలో కొనసాగుతున్న తీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవబడిన చెప్పవచ్చు. సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి దాబాలకు, హోటళ్లకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు వెళ్లి ఆహారం తీసుకునే వారి సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఆయా కేంద్రాల్లో ఆహార పదార్థాల నాణ్యత, వంటగదుల పరిశుభ్రత, మాంసం నిల్వ, వంట నూనె వినియోగంపై తగిన పర్యవేక్షణ ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధితో గుమ్మడిదలతో పాటు బొంతపల్లి, అన్నారం పారిశ్రామిక ప్రాంతాల్లో ఉన్న దాబాలతో పాటు ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మిర్చి బండ్లు, పానీ పూరి ఇతర చిరుతిళ్ల దుకాణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(ఇందిర)
గుమ్మడిదల, (సిరి న్యూస్):

రంగుల రుచి..కానరాని శుచి !

- రోగాలకు నిలయాలుగా దాబాలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు
- నాణ్యత డొల్లతో ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోనే అధికారులెవరు?
- అపరిశుభ్ర వాతావరణంలో ఆహార తయారీపై ఆందోళన
- నాసిరకం పదార్థాలు, నిల్వ మాంసం వినియోగంపై ఆరోపణలు
- గుమ్మడిదల, బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి..
- నర్సాపూర్ ప్రాంతంలో ఫుడ్ పాయిజన్ తో పలువురికి అస్వస్థత

మున్సిపల్, ఆహార భద్రత అధికారుల స్పందన ఏది?

గుమ్మడిదల ప్రాంతం గతంలో గ్రామపంచాయతీ పరిధిలో ఉండగా, ప్రస్తుతం మున్సిపాలిటీగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలోని ఆహార విక్రయ కేంద్రాలపై పర్యవేక్షణ కూడా సమర్థంగా ఉండాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గతంలో తనిఖీలు, చర్యలు సక్రమంగా జరగలేదనే విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ అధికారులు, ఆహార భద్రత శాఖ అధికారులు సమన్వయంతో గుమ్మడిదలతోపాటు బొంతపల్లి ప్రాంతాల్లోని ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మిర్చి దుకాణాలు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. వంటగదుల పరిశుభ్రత, మాంసం నిల్వ విధానం, నూనె వినియోగం, తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల భద్రతను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే అప్రమత్తమై ప్రమాదాలను నివారించడం అధికారుల బాధ్యత. తనిఖీలను కేవలం నామమాత్రంగా నిర్వహించకుండా, నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ శాఖ, ఆహార భద్రత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

పెరుగుతున్న కేంద్రాలు.. కనిపించని పరిశుభ్రత

ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు రద్దీగా కనిపిస్తున్నాయి. కార్మికులు, ఉద్యోగులు, యువతతో పాటు కుటుంబాలు కూడా ఈ కేంద్రాలపై ఆధారపడుతున్నారు. అయితే కొన్ని చోట్ల ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే ప్రదేశాలు, వంట సామగ్రి, పరిసరాల పరిశుభ్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆహారాన్ని తయారు చేసే ప్రాంతాల్లో శుభ్రత, పదార్థాల నిల్వ విధానం, వంట చేసేవారు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆహారం రుచిగా ఉంటే సరిపోదు అది ఆరోగ్యానికి హాని కలిగించనిదిగా ఉండాలి. నాణ్యత లేని ముడి పదార్థాలు, కలుషిత నీరు, సరిగా నిల్వ చేయని ఆహార పదార్థాలు వినియోగిస్తే ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి విషయంలో మరింత జాగ్రత్త అవసరం. అందువల్ల ఆహార నాణ్యతపై రాజీ పడకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది.

ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసంతో వంటకాలు..

దాబాలు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్, ఇతర మాంసాహార పదార్థాలను ఎలా నిల్వ చేస్తున్నారు? వాటి తాజాదనాన్ని ఎలా నిర్ధారిస్తున్నారు? అనే అంశాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయని మాంసం, ఎక్కువసేపు బయట ఉంచిన ఆహార పదార్థాలు కలుషితమయ్యే అవకాశం ఉంది. అదే విధంగా ఒకసారి వంటకు వినియోగించిన నూనెను పదేపదే ఉపయోగించడం వల్ల ఆహార నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. వంటగదుల్లో అపరిశుభ్రత, వ్యర్థాల పేరుకుపోవడం, ఈగలు, ఇతర కీటకాల బెడద వంటి సమస్యలు ఉంటే అవి ఆహార భద్రతకు ముప్పుగా మారవచ్చు. అయితే ఏయే కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నది అధికారుల తనిఖీల ద్వారా నిర్ధారించాల్సి ఉంది. ఆరోపణలకే పరిమితం కాకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించి, తప్పులు గుర్తిస్తే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాపారమే లక్ష్యమా.. ఆరోగ్యం పట్టదా?

గుమ్మడిదల పారిశ్రామిక వాడ ప్రాంతంలో ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలకు వచ్చే వినియోగదారులు ఆహారం తయారయ్యే విధానాన్ని, ఉపయోగిస్తున్న ముడి పదార్థాల నాణ్యతను ప్రతిసారీ పరిశీలించే అవకాశం ఉండదు. నిర్వాహకులపై నమ్మకంతోనే డబ్బులు చెల్లించి ఆహారం తీసుకుంటారు. అలాంటి పరిస్థితుల్లో వినియోగదారులకు సురక్షితమైన ఆహారం అందించడం వ్యాపార నిర్వాహకుల కనీస బాధ్యత. ఆహారం తయారీకి ఉపయోగించే పదార్థాల నాణ్యత, నిల్వ గడువు, వంటగదుల పరిశుభ్రత, తాగునీటి భద్రత, వ్యర్థాల తొలగింపు వంటి అంశాలను నిర్లక్ష్యం చేయకూడదు.



'స్మార్ట్'గా బాల్యం బందీ!

స్మార్ట్‌ఫోన్ల వ్యసనంలో చిక్కుకుపోతున్న చిన్నారుల



ఆటపాటల స్థానంలో స్క్రీన్ కు బానిసత్వం

రీల్స్ మాయలో కరిగిపోతున్న సృజనాత్మకత

- రేపటి తరం మానసిక సంక్షోభంలో పడకముందే మేల్కొనాలి
- అంతులేని రీల్స్ స్క్రోలింగ్‌తో క్షీణిస్తున్న ఏకాగ్రత, సహనం
- షాకింగ్ కంటెంట్, అసహజ ప్రవర్తనలకే అలవాటుపడుతున్న మెదడు
- సామాజిక మాధ్యమాల మాయతో పెరుగుతున్న ఒంటరితనం
- నిశ్శబ్ద గురువులా పిల్లల ఆలోచనలను శాసిస్తున్న అల్గారిథమ్స్
- ప్రేమతో కూడిన నిరంతర పర్యవేక్షణే శ్రీరామరక్ష
- పాఠశాలల్లో డిజిటల్ అక్షరాస్యత, భావోద్వేగ విద్య తప్పనిసరి

(కొత్త గంగాధర్)
(వెల్దుర్తి-సిరి న్యూస్):

ఒకప్పుడు పద్నాలుగేళ్ల లోపు చిన్నారుల ప్రపంచం బడి పుస్తకాలు, ఆటస్థలాలు, తోటి స్నేహితుల కేరింతలు, భవిష్యత్ కలలతో ఆహ్లాదకరంగా సాగిపోయేది. కానీ ఆధునిక యుగంలో ఆ అమూల్యమైన బాల్యం కాస్తా స్మార్ట్‌ఫోన్ నాలుగు అంగుళాల డిజిటల్ స్క్రీన్‌కే పరిమితమై బందీగా మారుతోంది. చేతిలో ఇమిడిపోయే ఫోన్ ప్రపంచ జ్ఞానాన్ని అందించే అద్భుత సాధనమే అయినప్పటికీ, సరైన నియంత్రణ లేకపోతే లేత మనసులను చిదిమేసే ప్రమాదకర విషవలయంగా రూపాంతరం చెందుతోంది. ఆన్‌లైన్ తరగతుల అవసరం పేరిట మొదలైన ఈ అలవాటు, నేడు చిన్నారులను ఒక వ్యసనంలా చుట్టుముట్టి వారి ఆలోచనా పరిధిని శాసిస్తోంది.

రీల్స్ మాయలో ఏకాగ్రత గల్లంతు..

సోషల్ మీడియా వేదికలు పిల్లల విజ్ఞానం కోసం కాకుండా, వారి సమయాన్ని నిరంతరం స్క్రీన్‌కే కట్టిపడేసే వాణిజ్య సూత్రాలతో పనిచేస్తున్నాయి. కొన్ని సెకన్ల నిడివి ఉండే షార్ట్స్, రీల్స్ నిరంతరం పైకి స్క్రోల్ చేస్తుంటే మెదడులో విడుదలయ్యే డోపమైన్ వారిని మరింత కావాలి అనే డిజిటల్ బానిసత్వంలోకి నెడుతోంది. షాక్ కలిగించే విన్యాసాలు, అశ్లీలత, విపరీత చేష్టలు మాత్రమే ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తుండటంతో అల్గారిథమ్స్ అలాంటి కంటెంట్‌నే పదేపదే చిన్నారుల ముందు ఉంచుతున్నాయి. తక్షణ ఆనందాన్ని ఇచ్చే ఈ వీడియోల కారణంగా పిల్లల్లో పుస్తకాలు చదివే ఓపిక, సమస్యలను లోతుగా పరిష్కరించే సహనం, సుదీర్ఘ సమయం ఒకే అంశంపై నిలకడగా ఉండే ఏకాగ్రత పూర్తిగా నశిస్తున్నాయి.





అంతర్గతంగా కుంగిపోతున్న నవతరం..

సామాజిక మాధ్యమాలు సృష్టించే వర్చువల్ ప్రపంచం పిల్లల మనస్తత్వాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. డిజిటల్ తెరపై ఇతరుల కృత్రిమ లైఫ్ స్టైల్‌ను చూస్తూ పిల్లలు తమను తాము పోల్చుకోవడం మొదలుపెడుతున్నారు. వారికి ఉన్న గుర్తింపు, ఆకర్షణ నాకు ఎందుకు లేదు? అనే అభద్రతా భావం వారి లేత హృదయాల్లో వేళ్లూనుకుంటోంది.



పైకి నవ్వుతూ కనిపించినా లోలోపల తీవ్రమైన న్యూనతాభావం, ఆందోళన, ఒంటరితనంతో కునారిల్లుతున్నారు. ఏది మంచి, ఏది చెడు అని నిర్ణయించుకునే విచక్షణా జ్ఞానం ఎదగకముందే స్క్రీన్‌పై కనిపించే హింస, అసహజ ప్రవర్తనలను సాధారణమైనవిగా భావిస్తూ అనుకరిస్తుండటం వారి వ్యక్తిత్వాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తోంది.

తగ్గిపోతున్న కుటుంబ సంభాషణలు...

ఉరుకుల పరుగుల జీవనశైలిలో తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం రోజుకు కొన్ని నిమిషాలకు పరిమితమవుతుండగా, స్మార్ట్‌ఫోన్ మాత్రం గంటల తరబడి వారి పక్కనే ఉంటోంది. ఈ అసమాన పోటీలో చరవాణే చిన్నారులకు నిశ్శబ్ద గురువుగా మారిపోతోంది. పిల్లల చేతికి ఖరీదైన ఫోన్లను కొనిచ్చి చేతులు దులుపుకుంటున్న పెద్దలు, ఆ డిజిటల్ ప్రపంచంలో ఎలా అడుగులు వేయాలో నేర్పించడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. పిల్లలపై ఆగ్రహం వ్యక్తం చేయడం, వారిని భయపెట్టడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, అసలు వారు ఆ కంటెంట్‌కు ఎందుకు ఆకర్షితులవుతున్నారో ఆత్మీయంగా మాట్లాడి తెలుసుకోవాల్సిన గురుతర బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది.

ప్రభుత్వాల కఠిన నియంత్రణ అవసరం..

ఈ ముప్పును కేవలం ఒక్క కుటుంబ సమస్యగా చూడకుండా సామాజిక విపత్తుగా పరిగణించాలి. పాఠశాల స్థాయి నుంచే పాఠ్యాంశాలతో పాటు డిజిటల్ అక్షరాస్యత, స్క్రీన్ టైమ్ నియంత్రణ, భావోద్వేగ సమతుల్యతను నేర్పించే విద్యను బోధించాలి. అలాగే ప్రభుత్వాలు పాలసీ స్థాయిలో జోక్యం చేసుకుని టెక్నాలజీ కంపెనీలపై కఠిన నిబంధనలు విధించాలి. మైనర్ల రక్షణ కోసం పకడ్బందీ వయస్సు ధ్రువీకరణ విధానాలను అమలు చేయడంతో పాటు, పిల్లలను లక్ష్యంగా చేసుకునే హానికరమైన కంటెంట్‌ను తొలగించే చట్టపరమైన నిబంధనలను పటిష్టం చేయాలి. మేల్కొనకుంటే మానసిక సంక్షోభమే ఇక్కడ అసలు సమస్య అమాయక పిల్లలది కాదు.. నియంత్రణ లేని డిజిటల్ ప్రపంచం, మార్గదర్శనం చేయని పెద్దల నిర్లక్ష్యమే అసలైన కారణం. ప్రస్తుతం మనం తీసుకునే దిద్దుబాటు చర్యలే రేపటి సమాజ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. పిల్లలు ఎంత సమయం ఫోన్‌లో గడుపుతున్నారనే స్క్రీన్ టైమ్ కంటే, వారు అందులో ఏం చూస్తున్నారనే కంటెంట్ పై కుటుంబాలు గట్టి నిఘా ఉంచాలి. ఇప్పుడే మేల్కొని చిన్నారులను స్మార్ట్‌ఫోన్ చెర నుంచి విముక్తులను చేసి నిజమైన మానవీయ బంధాలు, ఆటపాటల వైపు నడిపించకపోతే, భవిష్యత్తులో తీవ్రమైన మానసిక రోగుల తరాన్ని మనమే తయారు చేసిన నేరస్తులమవుతామని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

